జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం



# ఆదిలాబాద్
## మంచిర్యాల-కుమరం భీం-నిర్మల్

సోమవారం 22 జూన్ 2026 పేజీలు : 8

# జూన్ 23 న రాష్ట్ర వ్యాప్త పాఠశాలల బంద్




ప్రైవేట్,కార్పొరేట్ విద్యా మాఫియాకు బ్రాండ్ అంబాసిడర్ లా వ్యవహరిస్తున్న రేవంత్ రెడ్డి...

రేషనలైజేషన్ పేరుతో 23000 ప్రభుత్వ స్కూళ్ల మూసివేతకు కుట్ర...

ప్రైవేట్,కార్పొరేట్ విద్యాసంస్థల విచ్చలవిడి ఫీజుల దోపిడీకి ప్రభుత్వం రెడ్ కార్పెట్...

అటకెక్కిన విద్యాహక్కు చట్టం...ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కరువు...

ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థులకు ఇంకా అందని స్కూల్ యూనిఫామ్స్...

## పోలీసుల ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ
# యోగా దినోత్సవ వేడుకలు



300 మంది పోలీసు సిబ్బందితో హెడ్ క్వార్టర్స్‌లో సామూహిక యోగా నిర్వహణ

యోగా ద్వారా మానసిక, శారీరక ప్రశాంతత లభిస్తుంది

ఆసనాలు, ప్రాణాయామం, సూర్య నమస్కారాలు యోగాలో ప్రధానమైనవి

12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన జిల్లా ఎస్పీ

## గాంధీ పార్కులో
# చిన్నారుల రైలు పునఃప్రారంభం





# సింగరేణిలో అత్యంత పకడ్బందీగా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పారదర్శకంగా బొగ్గు రవాణా

ప్రతీ టన్ను బొగ్గుపై పటిష్టమైన పర్యవేక్షణ కారణంగా ఒక్కో కిలో బొగ్గు కూడా దొంగతనం జరగటం కానీ పక్కదారిపట్టే అవకాశం లేదు

మునిగంటి శ్రీనివాస్, జనరల్ మేనేజర్, శ్రీరాంపూర్

**మంచిర్యాల, 21, జూన్ (ప్రజా జ్యోతి):**సింగరేణిలో అత్యంత పకడ్బందీగా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పూర్తి పారదర్శకంగా బొగ్గు రవాణా జరుగుతుందని, ప్రతి టన్ను బొగ్గుపై పటిష్టమైన పర్యవేక్షణ కారణంగా ఒక్కో కిలో బొగ్గు కూడా దొంగతనం జరగటం కానీ పక్కదారి పట్టే అవకాశం లేదని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ స్పష్టం చేశారు. జీఎం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇటీవల సింగరేణిలో బొగ్గు మాయమైందని, భారీ స్థాయిలో బొగ్గు చోరీ జరిగిందని వస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని అన్నారు. సింగరేణిలో ఉత్పత్తి అయ్యే బొగ్గులో 85 శాతం రైలుమార్గం ద్వారా, 15 శాతం రోడ్డు మార్గం ద్వారా వినియోగదారులకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. బొగ్గు ఉత్పత్తి కేంద్రం నుంచి వినియోగదారుడి వద్దకు చేరే వరకు ప్రతి దశలో డిజిటల్ పర్యవేక్షణ, భద్రతా తనిఖీలు, ఆన్‌లైన్ రికార్డింగ్ వ్యవస్థ అమలులో ఉంటుందని వివరించారు. ప్రస్తుతం శ్రీరాంపూర్ ఏరియాలో 6 భూగర్భ గనులు, 2 ఓపెన్‌కాస్ట్ గనుల ద్వారా రోజుకు సుమారు 12 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా జరుగుతోందన్నారు. శ్రీరాంపూర్ సీహెచ్‌పీ, శ్రీరాంపూర్ ఓసీ సైడింగ్ ద్వారా ఎస్టీపీపీ, ఎన్టీపీసీ, యాదాద్రి, కేపీసీఎల్, మహాజెన్‌కో తదితర థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. రోడ్డు మార్గంలో బొగ్గు రవాణా విషయంలో హైదరాబాద్‌లోని మార్కెటింగ్ విభాగం ద్వారా ఎస్ఓపీ ఆధారిత వ్యవస్థలో ముందుగానే కేటాయింపులు జరుగుతాయని తెలిపారు. ఏ వినియోగదారుడు ఏ గని నుంచి ఎంత పరిమాణంలో బొగ్గు స్వీకరించాలో డిజిటల్ విధానంలో ముందుగానే నమోదు చేస్తారని అన్నారు .బొగ్గు రవాణా పూర్తిగా విజిలెన్స్ విభాగం, కంపెనీ నిబంధనలు, సర్క్యులర్లకు లోబడి జరుగుతుందని తెలిపారు. కోల్ ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లకు చెందిన లారీల వివరాలను సంబంధిత గని మేనేజర్లు, ఏజెంట్లు పరిశీలించి ఎస్ఓపీ వ్యవస్థలో నమోదు చేసిన తర్వాత మాత్రమే అనుమతులు ఇస్తారని పేర్కొన్నారు. అందులో లారీ లోడింగ్ సామర్థ్యం, ఏ గని నుంచి ఏ ప్రాంతానికి బొగ్గు తరలించాలనే వివరాలు కూడా నమోదు అవుతాయని తెలిపారు . ఇలా సిస్టంలో నమోదు చేసిన ప్రతి లారీకి జీపీఎస్, ఆర్ఎఫ్ఐడీ ట్యాగ్ అమర్చబడుతుందని, వాహన నెంబర్,




గమ్యస్థానం తదితర వివరాలు నమోదు చేస్తారని తెలిపారు. అనంతరం వీటీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బూమ్ బ్యారియర్లు, సీసీ కెమెరాల పర్యవేక్షణలో వే బ్రిడ్జిల వద్దకు వాహనాలు చేరుకుంటాయన్నారు. ప్రతి లారీ నిర్దేశించిన మార్గంలోనే ప్రయాణించేలా జియో ఫెన్సింగ్ విధానం అమలు చేస్తున్నామని తెలిపారు. మార్గం తప్పినా, లేదా రెండు నిమిషాలకు మించి మధ్యలో నిలిచినా సంబంధిత గని మేనేజర్, ఏజెంట్, ప్రాజెక్ట్ అధికారి, భద్రతా అధికారులకు వెంటనే అలర్ట్ సందేశాలు వెళ్తాయని వివరించారు. ప్రతి లారీకి వే బ్రిడ్జి ద్వారా లోడింగ్ స్లిప్ జారీ చేస్తారని, అన్‌లోడింగ్ సమయంలో బొగ్గు పూర్తిగా దిగిందా లేదా అన్నది సీసీ కెమెరాల ద్వారా పరిశీలించే వ్యవస్థ ఉందన్నారు. ఒకవేళ లోడింగ్ సమయంలో నమోదైన బరువు, అన్‌లోడింగ్ సమయంలో నమోదైన బరువులో టన్నుకి మించి తేడా వస్తే సంబంధిత కాంట్రాక్టర్ నుంచి రికవరీ చేస్తామని తెలిపారు. వే బ్రిడ్జిలు సక్రమంగా పనిచేసేలా ప్రతి నెల కమిటీ ద్వారా కాలిబ్రేషన్ కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు .వీటీఎస్‌లో భాగంగా సీసీ కెమెరాలు, బూమ్ బ్యారియర్లు, అలర్ట్ మెసేజ్ వ్యవస్థ, ఆర్ఎఫ్ఐడీ ట్యాగులు, కోల్‌నెట్, ఎలక్ట్రానిక్ వే బ్రిడ్జిలు, సింగరేణి భద్రతా విభాగం, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, హోలోగ్రామ్ చలానాలు, టాస్క్‌ఫోర్స్ పర్యవేక్షణ వంటి బహుళ స్థాయి భద్రతా వ్యవస్థల మధ్య బొగ్గు రవాణా నిర్వహించబడుతుందని అన్నారు. పైన పేర్కొన్న అత్యాధునిక సాంకేతిక వ్యవస్థల వినియోగం కారణంగా ఒక్క కిలో బొగ్గు కూడా దొంగతనం జరగటం కానీ, పక్కదారి పట్టటం కానీ జరగదని మునిగంటి శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఈ సమావేశం లో డీజీఎం (పర్సనల్) ఎస్. అనిల్ కుమార్,ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ సి ఎచ్ .వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు .

# పెయింటర్ కార్మిక సమస్యలు వెంటనే పరిష్కరించాలి

## మంచిర్యాల ఏరియా పెయింటర్ వర్కర్స్ యూనియన్ నాయకులు

**మంచిర్యాల, 21, జూన్ (ప్రజా జ్యోతి):**పెయింటర్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మంచిర్యాల ఏరియా పెయింటర్ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. మంచిర్యాలలోని సుతార్ సంఘ భవనంలో మంచిర్యాల ఏరియా పెయింటర్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం జనరల్ బాడీ సమావేశంను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెయింటింగ్ సంఘం జిల్లా అధ్యక్షులు మాచర్ల సదానందం మాట్లాడుతూ, ప్రతి ఒక్క కార్మికుడు తన భవిష్యత్ భద్రత కోసం జీవిత బీమా చేయించుకోవాలని సూచించారు. 55 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్క కార్మికునికి పెన్షన్ పథకం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా భవన నిర్మాణ కార్మిక సోదరులందరికీ ఈఎస్ఐ ఆసుపత్రి సౌకర్యం కల్పించాలని కోరారు. కార్మికుల సంక్షేమం, భద్రత కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి కార్మికుడు సకాలంలో సభ్యత్వ రుసుములు చెల్లిస్తూ సంఘ



బలోపేతానికి సహకరించాలని పిలుపునిచ్చారు. అలాగే కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని లేబర్ రేట్లు, గుత్తా కూలీ రేట్లు, బిల్లింగ్ రేట్లను పెంచడం జరిగిందని తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు జమీల్, పట్టణ కార్యదర్శి గణి, రొడ్డ రవి, దాసరి రాజబాబు, వినోద్, గురువయ్య, సురేందర్, ఎండీ రఫీ, జిల్లా ప్రధాన కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు. కార్మిక సోదరులు అధిక సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేశారు.

# వాంకిడిలో ఘనంగా యోగ దినోత్సవం

పీహెచ్‌సీ, సీహెచ్‌సీల్లో యోగా శిబిరం

ఆరోగ్యకర జీవన విధానానికి యోగా దోహదం: డా. వినయ్



**ఆసిఫాబాద్ జూన్ 21(ప్రజా జ్యోతి** 12వ అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా వాంకిడి పీహెచ్‌సీ, సీహెచ్‌సీల్లో శనివారం యోగా శిబిరం నిర్వహించారు. బోధకుడు సెండె రవీందర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో డాక్టర్ వినయ్ పాల్గొన్నారు.యోగతో శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత లభిస్తుందని, ఒత్తిడి తగ్గి రోగనిరోధక శక్తి పెరుగుతుందని డా. వినయ్ తెలిపారు. కండరాల నొప్పుల నివారణకు యోగా ఎంత గానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్ఈఓ రవిదాస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం ప్రతి బీసీ ఉద్యోగి సంఘానికి అండగా నిలవాల్సిన అవసరం ఉన్నది

సింగరేణి బీసీ ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు ఐక్యంగా ముందుకు రావాలి

ముస్కె సమ్మయ్య




**మంచిర్యాల, 21, జూన్ (ప్రజాజ్యోతి):**సింగరేణి బీసీఅండ్ ఓబీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్, శ్రీరాంపూర్ బ్రాంచ్ ఆధ్వర్యంలో నస్పూర్‌లోని సీసీసీ ప్రెస్ క్లబ్‌లో ముఖ్య సమావేశం ను నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర నాయకులు ముస్కె సమ్మయ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ, సింగరేణి ఉద్యోగుల రిజర్వేషన్ విధానం, ఉద్యోగుల సంక్షేమం, పదోన్నతులు (ప్రమోషన్లు), క్యాచ్-అప్ రూల్, అలాగే సంఘం బలోపేతానికి సంబంధించిన కీలక అంశాలపై సమగ్రంగా వివరించారు. ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం ప్రతి బీసీ ఉద్యోగి సంఘానికి అండగా నిలవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సంఘటిత శక్తితో ఉద్యోగుల సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించు కోవచ్చని, ఉద్యోగుల హక్కుల సాధనలో ఐక్యత ఎంతో అవసరమని అన్నారు. సింగరేణి సంస్థలో పనిచేస్తున్న బీసీ ఉద్యోగులు తమ హక్కులు, అవకా శాలు, సంక్షేమ అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఉద్యోగుల అభ్యున్నతే సంఘం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఉద్యోగుల సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి సంఘం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.ఈ సమావేశంలో శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షులు శ్రీనివాస్ కార్యదర్శులు బారపాటి మారుతి బద్రి బుచ్చయ్య సహాయ కార్యదర్శి చంద్రమోహన్ జాయింట్ సెక్రటరీ రఘురాం కోశాధికారి మల్లేశ్ గొల్ల మహేందర్ కొత్తపల్లి రవీందర్ కమురోద్దీన్ మహేష్ అలాగే పిట్ సెక్రటరీలు మనోజ్, మదన్, నరేష్, పవన్, భీమన్న, వినోద్, కారుకూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా శ్రీరాంపూర్ ఏరియాకు చెందిన బీసీ ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేశారు.

# నీట్ పరీక్షా కేంద్రాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు పరిశీలించిన డీసీపీ భాస్కర్





## ప్రశాంతంగా నీట్ పరీక్ష

**మంచిర్యాల, 21, జూన్ (ప్రజాజ్యోతి):** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల పట్టణంలో నిర్వహించిన నీట్ పరీక్షల సందర్భంగా ఏర్పాటు చేసిన ఐదు పరీక్షా కేంద్రాలను మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్ సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాలతో పాటు ఇతర పరీక్షా కేంద్రాలను ఆయన తనిఖీ చేసి, విధుల్లో ఉన్న పోలీసు సిబ్బంది, అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ మంచిర్యాల పట్టణంలోని ఐదు పరీక్షా కేంద్రాల్లో మొత్తం 1,204 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉదయం 11 గంటల నుంచే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తున్నట్లు తెలిపారు .పరీక్షా కేంద్రాల్లో కట్టుదిట్టమైన తనిఖీలు నిర్వహించి, ఎలక్ట్రానిక్ పరికరాలు, నిషేధిత వస్తువులు లోపలికి తీసుకెళ్లకుండా ప్రత్యేక చర్యలు చేపట్టామని తెలిపారు. పరీక్షల నిర్వహణలో పాల్గొంటున్న సిబ్బందిని కూడా పూర్తిస్థాయిలో తనిఖీ చేసిన అనంతరమే కేంద్రాల్లోకి అనుమతిస్తున్నట్లు వివరించారు .కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేయడంతో పాటు సీఆర్పీఎఫ్, స్థానిక ఆర్మ్డ్ రిజర్వ్ పోలీసు బలగాలు, సివిల్ పోలీసులతో ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు .విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరుకునేందుకు ప్రభుత్వ బస్సు సౌకర్యాలతో పాటు రైల్వే స్టేషన్, బస్ స్టాండ్ ప్రాంతాల్లో ప్రత్యేక రవాణా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అవసరమైన చోట్ల పోలీసు వాహనాలను కూడా అందుబాటులో ఉంచామన్నారు. మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తామని, అనంతరం ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించబడతాయని పేర్కొన్నారు. పరీక్షలు ముగిసిన అనంతరం పరీక్షా సామగ్రిని సీఆర్పీఎఫ్, స్థానిక పోలీసుల భద్రత మధ్య సంబంధిత అధికారులకు తరలిస్తామని తెలిపారు. ప్రస్తుతం అన్ని పరీక్షా కేంద్రాల్లో ప్రశాంత వాతావరణం నెలకొని ఉందని, విద్యార్థులు ఎలాంటి ఆందోళన చెందకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని డీసీపీ సూచించారు. ఈ కార్యక్రమంలో జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, మంచిర్యాల పట్టణ ఇన్‌స్పెక్టర్ ప్రమోద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# నీట్ పరీక్ష రాసేందుకు విద్యార్థినికి అండగా నిలిచిన భీమారం ఎస్సై రాజేందర్



**మంచిర్యాల, జూన్ 21 (ప్రజా జ్యోతి):** పరీక్షలు విద్యార్థుల జీవితంలో అత్యంత కీలకమైనవి. ముఖ్యంగా నీట్ వంటి పోటీ పరీక్షల సమయంలో చిన్న సమస్య కూడా విద్యార్థులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తుంది. అలాంటి సమయంలో మానవత్వంతో స్పందించి ఓ విద్యార్థినికి అండగా నిలిచిన భీమారం ఎస్సై రాజేందర్ సేవలు ప్రశంసలు అందుకుంటున్నాయి. రామగుండం పోలీస్ కమిషనరేట్, మంచిర్యాల జోన్ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన నీట్ పరీక్షా కేంద్రం వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. పరీక్ష రాయడానికి వచ్చిన ఓ విద్యార్థిని పాస్‌పోర్టు సైజు ఫొటో తీసుకురావడం మరిచిపోయింది. పరీక్షా కేంద్ర నిబంధనల ప్రకారం ఫొటో తప్పనిసరి కావడంతో ఆమె తీవ్ర ఆందోళనకు గురైంది. పరీక్ష రాయలేనేమోనన్న భయంతో కేంద్రం బయటకు వచ్చిన విద్యార్థిని పరిస్థితిని అక్కడ విధులు నిర్వహిస్తున్న భీమారం ఎస్సై రాజేందర్ గమనించారు. విద్యార్థిని ఆందోళనను అర్థం చేసుకున్న ఎస్సై రాజేందర్ వెంటనే స్పందించి, పోలీసు వాహనంలో సమీపంలోని ఫొటో స్టూడియోకు తీసుకెళ్లి ఫొటో తీయించి, అనంతరం తిరిగి సకాలంలో పరీక్షా కేంద్రానికి చేర్చారు. దీంతో విద్యార్థిని ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షకు హాజరైంది. విద్యార్థిని భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని తక్షణమే స్పందించి సహాయం చేసిన ఎస్సై రాజేందర్‌ను అక్కడ ఉన్న విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజలు అభినందించారు. పోలీసుల మానవతా దృక్పథానికి ఇది మంచి ఉదాహరణగా నిలిచిందని ప్రశంసలు వ్యక్తం చేశారు.

## సల్పలగూడలో యోగా డే వేడుకలు

**బేర్ బాంబూ, సన్ షైన్ స్కూల్ ఆధ్వర్యంలో అవగాహన**

**హాజరైన సంపత్ రెడ్డి, సంతోష్ కులకర్ణి**




**ఆసిఫాబాద్ జూన్ 21 ప్రజా జ్యోతి** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని వాంకిడి మండలం సల్పలగూడ గ్రామంలో బేర్ బాంబూ-బాంబూ అకాడమీ ఫర్ రీసెర్చ్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, సన్ షైన్ మోడల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆధ్వర్యంలో యోగా అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ముఖ్య అతిథిగా టీబీపీఎస్ఏ అధ్యక్షుడు కేసిడి సంపత్ రెడ్డి, ప్రత్యేక అతిథిగా బేర్ బాంబూ ప్రతినిధి సీపీ సంతోష్ కులకర్ణి హాజరయ్యారు. యోగా వలన శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని, శరీర దృఢత్వం, ఫ్లెక్సిబిలిటీ, జీర్ణశక్తి, రోగనిరోధక శక్తి పెరుగుతాయని వివరించారు.బేర్ బాంబూ గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో బాంబూ ఆధారిత జీవనోపాధి, నైపుణ్యాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తోందని సంతోష్ కులకర్ణి తెలిపారు. గిరిజన యువతను స్వయం ఉపాధి వైపు ప్రోత్సహించడం, బాంబూ విలువ ఆధారిత ఉత్పత్తులు, సుస్థిర అభివృద్ధిపై అవగాహన కల్పించడమే తమ లక్ష్యమన్నారు.కార్యక్రమంలో యోగాలో పాల్గొన్న విద్యార్థులకు పెన్నులు, నోట్‌ప్యాడ్‌లు పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ కందికట్ల వెంకటేష్, ఇటన్నార్ రాజేశ్వర్, కుల్దీప్ దురం, గ్రామ పటేల్ సిడం వెంకటేష్, సంపత్ సిడం, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు కట్టుబడి ఉన్నాం: జాడి వినోద్

**1వ వార్డును ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దడమే లక్ష్యం**



**ఆసిఫాబాద్ జూన్ 21 ప్రజా జ్యోతి** ఆసిఫాబాద్ మునిసిపల్ పరిధిలో జనకపూర్ 1వ వార్డు అభివృద్ధి దిశగా కౌన్సిలర్ జాడి వినోద్ కుమార్ చర్యలు చేపట్టారు. వార్డులో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనుల ప్రారంభానికి సంబంధించి ఆదివారం అధికారులు మేజర్‌మెంట్లు నిర్వహించారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ జాడి వినోద్ కుమార్ మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. 1వ వార్డును అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు.వార్డు ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నామని, సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు పూర్తయితే ప్రజలకు మెరుగైన రవాణా, పారిశుధ్య సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజల సహకారం అవసరమని ఆయన కోరారు.

# ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం యోగ సాధన ఎంతో అవసరం

### లేడీస్ క్లబ్ ప్రెసిడెంట్, సేవా సమితి అధ్యక్షురాలు శ్రీమతి మునిగంటి ఉమారాణి

### శ్రీరాంపూర్ ఏరియా ఎస్‌సీఓఏ క్లబ్‌లో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు





**మంచిర్యాల, 21, జూన్ (ప్రజా జ్యోతి):**మారుతున్న జీవనశైలిలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి యోగా సాధన అత్యంత అవసరమని లేడీస్ క్లబ్ ప్రెసిడెంట్, సింగరేణి శ్రీరాంపూర్ ఏరియా సేవా సమితి అధ్యక్షురాలు శ్రీమతి మునిగంటి ఉమారాణి అన్నారు.ప్రపంచ వ్యాప్తంగా 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించిన సందర్భంగా శ్రీరాంపూర్ ఏరియా ఎస్‌సీఓఏ క్లబ్‌లో కూడా యోగా దినోత్సవాన్ని ఉత్సాహంగా ఆదివారం నిర్వహించారు. లేడీస్ క్లబ్ ప్రెసిడెంట్, సేవా సమితి అధ్యక్షురాలు శ్రీమతి మునిగంటి ఉమారాణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని యోగాసనాలు సాధన చేశారు. ఈ సందర్భంగా మునిగంటి ఉమారాణి మాట్లాడుతూ, మారుతున్న జీవనశైలిలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి యోగా సాధన అత్యంత అవసరమని తెలిపారు. ఈ సంవత్సరం “ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం యోగా” అనే థీమ్‌తో యోగా దినోత్సవాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. వయసు పెరుగుతున్న కొద్దీ శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతతను కాపాడుకోవడంలో నిత్య యోగా సాధన కీలక పాత్ర పోషిస్తుందన్నారు. సింగరేణి సంస్థ అన్ని ఏరియాలలో యోగాను ప్రోత్సహించేందుకు ఖర్చుకు వెనుకాడకుండా ప్రత్యేక యోగా కేంద్రాలను ఏర్పాటు చేసి ఉద్యోగులు, కుటుంబ సభ్యులకు యోగా పట్ల అవగాహన కల్పిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో లేడీస్ క్లబ్ సెక్రెటరీ దివ్యతో పాటు సింగరేణి అధికారుల సతీమణులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సింధు హాస్పిటల్‌లో సింగరేణి హెల్ప్ డెస్క్ ప్రారంభం

### సింగరేణి ఉద్యోగులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు నాణ్యమైన వైద్యం



**మంచిర్యాల, 21, జూన్ (ప్రజాజ్యోతి):**సింగరేణి ఉద్యోగులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగులు మరియు వారి కుటుంబ సభ్యులకు నాణ్యమైన, వేగవంతమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో హైదరాబాద్ హైటెక్ సిటీలోని సింధు హాస్పిటల్‌లో ప్రత్యేక సింగరేణి హెల్ప్ డెస్క్‌ను ఆదివారం ప్రారంభించారు. సింగరేణి ఉద్యోగుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రారంభించిన ఈ హెల్ప్ డెస్క్ ద్వారా వైద్య సేవలు మరింత సులభతరం కానున్నాయని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా సింగరేణి కో-ఆర్డినేటర్ డాక్టర్ బాలకోటయ్య మాట్లాడుతూ, సింగరేణి ఉద్యోగులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగులు ఆరోగ్య సమస్యల సమయంలో మెరుగైన వైద్య సేవలు పొందేందుకు ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు తక్కువ ఖర్చుతో ఆధునిక వైద్య సేవలు పొందేందుకు ఇది ఉపయోగపడుతుందని తెలిపారు. సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్ మాట్లాడుతూ, సింగరేణి ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమం కోసం ఇలాంటి ప్రత్యేక చర్యలు చేపట్టడం మంచి పరిణామమని పేర్కొన్నారు. ముఖ్యంగా పదవీ విరమణ తర్వాత ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి ఈ హెల్ప్ డెస్క్ ద్వారా వైద్య సేవలు త్వరితగతిన అందుబాటులోకి వస్తాయని తెలిపారు. సింగరేణి కుటుంబాలకు ఇది ఎంతో ఉపయోగపడే నిర్ణయమని అన్నారు. సింధు హాస్పిటల్ సీఈఓ డాక్టర్ అంథోనీ లాజర్ బాసిల్ మాట్లాడుతూ, సింగరేణి ఉద్యోగులు మరియు పదవీ విరమణ పొందిన ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణకు తమ ఆసుపత్రి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. హెల్ప్ డెస్క్ ద్వారా రోగులకు అవసరమైన మార్గదర్శకత్వం, నమోదు ప్రక్రియలో సహకారం, వైద్య విభాగాల వివరాలు, చికిత్సకు సంబంధించిన సమాచారం వేగంగా అందించేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు వివరించారు .అత్యవసర పరిస్థితుల్లో రోగులకు తక్షణ సేవలు అందించడం, వైద్య సేవల వినియోగాన్ని సులభతరం చేయడం, చికిత్స సమయంలో ఎదురయ్యే ఇబ్బందులను తగ్గించడం ఈ హెల్ప్ డెస్క్ ప్రధాన ఉద్దేశమని అన్నారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ మార్కెటింగ్ అధికారులు సురేష్ కుమార్, నాగ వంశీ, బిల్లింగ్ అధికారులు కృష్ణారెడ్డి, జగదీశ్వరి, సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ఆళవందార్ వేణు మాధవ్, బీరయ్య, రఫిక్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి వ్యక్తి నిత్య జీవితంలో యోగాను భాగం చేసుకోవాలి

యోగా గురువు శ్రీనివాస్ రెడ్డి



**మంచిర్యాల, 21, జూన్ (ప్రజా జ్యోతి):**ప్రతి వ్యక్తి నిత్య జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని యోగా గురువు శ్రీనివాస్ రెడ్డి పిలుపు నిచ్చారు . అంతర్జాతీయ 12వ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంచిర్యాల లోని బాయ్స్ ఎస్-2 గ్రౌండ్‌లో జవాన్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఫిట్నెస్ సెంటర్ సహకారంతో యోగా దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా గురువు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ప్రతి వ్యక్తి నిత్య జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని సూచించారు. ప్రతిరోజూ యోగా చేయడం వల్ల ఆరోగ్య సమస్యలతో పాటు మానసిక ఒత్తిడి నుంచి కూడా ఉపశమనం లభిస్తుందని, యోగా ద్వారా శారీరక దృఢత్వం పెరగడమే కాకుండా మానసిక ప్రశాంతత కూడా కలుగుతుందన్నారు. ప్రస్తుతం వేగవంతమైన జీవనశైలిలో ప్రతి ఒక్కరూ వివిధ రకాల ఒత్తిడులకు గురవుతున్నారని, అలాంటి పరిస్థితుల్లో యోగా ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని అన్నారు. యోగాను ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తీసుకొచ్చి భారతీయ సంస్కృతికి ప్రత్యేక గుర్తింపు కల్పించడంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన కృషిని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా భారతీయ ప్రజలందరికీ 12వ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తుల ఆంజనేయులు, అశోక్, చంద్రకాంత్, ప్రదీప్, బందల రవీందర్, సాగర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## జయశంకర్ ఆశయ సాధనకు కృషి చేయాలి: సుదర్శన్ గౌడ్



**రామకృష్ణాపూర్,జూన్ 20 (ప్రజా జ్యోతి):**రామకృష్ణపూర్‌లో ప్రొఫెసర్ జయశంకర్ 15వ వర్ధంతి సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో జయశంకర్ చౌక్‌లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు కంబగోని సుదర్శన్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జయశంకర్ సార్ జీవితాంతం పోరాడారని, ఆయన ఆశయాలను కొనసాగించడం ప్రతి తెలంగాణ వాసి బాధ్యత అని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జాడి శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు పోగుల మల్లయ్య, రేవిల్లి ఓదెలు, బోయినపల్లి అనిల్ రావు, జీలుకర మహేష్, పారిపల్లి తిరుపతి, సీనియర్ నాయకులు కొండ కుమార్, అలుగుల సత్తయ్య, కౌన్సిలర్లు వీనంక శ్రీనివాస్, రంగరాజు, బొమ్మ భూమాగౌడ్, జంజిపల్లి శశికుమార్, రాజశేఖర్, యువ నాయకులు గాజుల చంద్రకిరణ్, రామిడి లక్ష్మీకాంత్, గొనే రాజేందర్, దబ్బేటి సంతోష్, నస్పూరి శివ తదితరులు పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కలను నెరవేర్చుతున్న ఇందిరమ్మ ఇళ్లు



**ఆసిఫాబాద్ జూన్ 21 ప్రజా జ్యోతి** పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేస్తూ ఇందిరమ్మ ఇళ్ల పథకం ఆశాకిరణంగా నిలుస్తోందని ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క అన్నారు. వాంకిడి మండలంలోని సొనాపూర్ గ్రామపంచాయతీలో మాడవి రాజేశ్వరి--సంతోష్ దంపతుల నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్రం సుగుణక్క మాట్లాడుతూ, నిరుపేద కుటుంబాలకు గౌరవప్రదమైన జీవనం అందించడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రధాన లక్ష్యమని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వాంకిడి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నారాయణ, స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొని గృహ యజమానులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు నారాయణ యువజన అధ్యక్షులు ఉపుల కృష్ణ, టౌన్ అధ్యక్షులు అనిల్, బంబర సర్పంచ్ బెండరే కృష్ణ సమేల సర్పంచ్ వాడ్గరే సంతోష్ బంబర ఉప సర్పంచ్ జాడి సంతోష్ ఓబీసీ సెల్ అధ్యక్షులు జాబోరే గణేష్, మాజీ సర్పంచ్ సెల్వట్కార్ పేంటు, చునర్కర్ శివాజీ,శ్రీను తదితరులు పాల్గొన్నారు

## ఉద్యోగ విరమణ పొందిన పోస్ట్ మాన్ అబ్దుల్ హాక్ కు ఘనంగా సన్మానం..



**తాండూర్ జూన్ 21 ప్రజా జ్యోతి** తాండూర్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో గల పోస్ట్ ఆఫీస్ కార్యాలయంలో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన పోస్ట్ మాన్ అబ్దుల్ హాక్ కు ఆదివారం రోజున ఘనంగా సత్కరించారు. సురభి మినీ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటుచేసిన ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమంలో తాండూర్ పోస్టు మాస్టర్ రాజా మొగిలి మాదారం పోస్టుమాస్టర్ మధుకర్ ఎన్ యు జి డి ఎస్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వరరావులు ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అబ్దుల్ హక్ గారు తాండూర్ పోస్ట్ ఆఫీస్ కార్యాలయ పరిధిలో అసిస్టెంట్ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్గా 47 సంవత్సరాలు సుదీర్ఘకారంగా పనిచేసినేడు ఉద్యోగ విరమణ పొందడం చాలా బాధాకరమన్నారు .ఇదే ప్రాంతంలో ఆయన జన్మించి విద్యాభ్యాసం కొనసాగించి ఇక్కడే ఉద్యోగ బాధ్యతలు స్వీకరించి చివరకు ఉద్యోగ విరమణ కూడా ఇక్కడే పొందడం చాలా అదృష్టవంతులని వారు కొనియాడారు. అనంతరం సన్మానానికి వచ్చిన అతిథులు ఆయనను పూలమాలలు శాలువాలతో ఘనంగా సత్కరించారు.

# బీసీ ఉద్యమాన్ని నిర్మిద్దాం.. బీసీ రాజ్యాధికారాన్ని సాధిద్దాం...

### బీసీ సమాజ్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు నరెడ్ల శ్రీనివాస్

### ఆచార్య కొత్తపల్లి జయశంకర్ 15వ వర్ధంతిని ఘనంగా నిర్వహించిన బీసీ సమాజ్



**మంచిర్యాల, 21, జూన్ (ప్రజా జ్యోతి):**ఆచార్య కొత్తపల్లి జయశంకర్ ఆశయాలు, సిద్ధాంతాలను ముందుకు తీసుకెళ్లే బాధ్యత నేటి తరంపై ఉందని, ఆయన స్ఫూర్తితో బలమైన బీసీ ఉద్యమాన్ని నిర్మించి బీసీల రాజ్యాధికార సాధన కోసం కృషి చేయాలని బీసీ సమాజ్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు నరెడ్ల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బీసీ సమాజ్ ఆధ్వర్యంలో తెలంగాణ జాతిపిత ఆచార్య కొత్తపల్లి జయశంకర్ 15వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా ఆదివారం మంచిర్యాల లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీసీ సమాజ్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు నరెడ్ల శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆచార్య జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆయన చేసిన విశిష్ట కృషి, త్యాగాలు, ఉద్యమ స్ఫూర్తిని స్మరించుకున్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను ప్రపంచానికి చాటి చెప్పడంలో ఆయన పోషించిన పాత్ర చిరస్మరణీయమని కొనియాడారు. ఈ సందర్భంగా నరెడ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ, ఆచార్య జయశంకర్ తెలంగాణ రాష్ట్ర సాధనకే కాకుండా సామాజిక న్యాయం, సమాన అవకాశాల కోసం కూడా నిరంతరం పోరాడారని, ఆయన ఆశయాలు, సిద్ధాంతాలను ముందుకు తీసుకెళ్లే బాధ్యత నేటి తరంపై ఉందన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన బీసీలు రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో తమ హక్కులను సాధించుకోవడానికి ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఆచార్య జయశంకర్ గారి స్ఫూర్తితో బలమైన బీసీ ఉద్యమాన్ని నిర్మించి, బీసీల రాజ్యాధికార సాధన కోసం కృషి చేయాలని ఆయన అన్నారు. తెలంగాణ అభివృద్ధి, సామాజిక న్యాయం, వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం ఆచార్య జయశంకర్ చూపిన మార్గంలో ముందుకు సాగడమే ఆయనకు నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో స్వర్ణకార సంఘం జిల్లా అధ్యక్షులు ధర్మవరపు బ్రహ్మయ్య, మంచిర్యాల పట్టణ కార్పెంటర్ అధ్యక్షులు పెద్దోజు హనుమంతు, అఖిల భారత విశ్వకర్మ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి మునిగంటి శ్రీనివాస్, బీసీ సమాజ్ జిల్లా ఉపాధ్యక్షులు బొలిశెట్టి లక్ష్మణ్, జిల్లా కార్యదర్శి పొట్టాల మల్లేష్, బీసీ సమాజ్ నాయకులు జక్కం రవీందర్, వెన్నంపల్లి మురళి, గుండ్ల లక్ష్మణ్, ఎండి లతీఫ్, తాటిపాముల సమ్మయ్య, సైనోజు నారాయణ చారి, పల్లపు శ్రీనివాస్ తదితరులు పాల్గొని ఆచార్య జయశంకర్ గారికి ఘన నివాళులు అర్పించారు.

# ఫాదర్స్ డే రోజున మోదీకి 'ప్రత్యేక శుభాకాంక్షలు' తెలిపిన ఎంపీ వంశీకృష్ణ



**మంచిర్యాల, 21, జూన్ (ప్రజాజ్యోతి):**ఫాదర్స్ డే సందర్భంగా పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు. సోషల్ మీడియా వేదికగా స్పందించిన ఆయన, కేంద్ర ప్రభుత్వం గత పదేళ్లలో ఇచ్చిన హామీలు, తీసుకున్న నిర్ణయాలు మరియు వాటి ప్రభావాలను ప్రస్తావిస్తూ ప్రధాని మోదీకి "ప్రత్యేక ఫాదర్స్ డే శుభాకాంక్షలు" తెలిపారు. ఈ సందర్భంగా ఎం పి మాట్లాడుతూ, "డీమోనిటైజేషన్ ఫాదర్, డ్రామా-బాజ్ పాలిటిక్స్ ఫాదర్, మెలోడీ డిప్లొమసీ ఫాదర్, రూపాయి డివాల్యుయేషన్ ఫాదర్, ప్రతి సంవత్సరం 2 కోట్ల ఉద్యోగాల హామీ ఫాదర్, నల్లధనం ఫాదర్, నీట్ పేపర్ లీకులు మరియు స్కామ్‌ల ఫాదర్, రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామన్న హామీ ఫాదర్, ప్రతి ఖాతాలో రూ.15 లక్షలు జమ చేస్తామన్న హామీ ఫాదర్, అచ్చే దిన్ ఫాదర్" అంటూ విమర్శనాత్మక వ్యాఖ్యలు చేశారు. దేశ యువత, నిరుద్యోగులు, రైతులు మరియు సామాన్య ప్రజలు ప్రస్తుతం అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై ప్రజలు సమాధానాలు కోరుతున్నారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో విఫలమైందని ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో ప్రజలకు జవాబుదారీతనం అత్యంత ముఖ్యమని, ఎన్నికల హామీలు కేవలం ప్రచార నినాదాలుగానే మిగలకూడదని ఎంపీ వంశీకృష్ణ అన్నారు. ప్రజల జీవితాలను ప్రభావితం చేసే అంశాలపై కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన సమాధానాలు ఇవ్వాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. చివరగా "యే హై ఆజ్ కా భారత్... హ్యాపీ ఫాదర్స్ డే నరేంద్ర మోదీ జీ. జై హింద్! జై భారత్!" అంటూ తన సందేశాన్ని ముగించారు.

## యోగతో ఆరోగ్యవంతమైన జీవనం సాధ్యం: ఆత్రం సుగుణక్క



ఆసిఫాబాద్, జూన్ 21 (ప్రజా జ్యోతి) అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆసిఫాబాద్ ప్రభుత్వ గిరిజన క్రీడా పాఠశాలలో నిర్వహించిన యోగా కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క పాల్గొన్నారు. క్రీడా విద్యార్థులతో కలిసి యోగాసనాలు చేసిన ఆమె, యోగ వల్ల శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత లభిస్తాయని తెలిపారు. విద్యార్థులు తమ రోజువారీ జీవితంలో యోగను భాగంగా చేసుకోవాలని సూచించారు. యోగ భారతీయ సంస్కృతికి చెందిన అమూల్యమైన వారసత్వమని, ప్రతి ఒక్కరూ యోగాభ్యాసం ద్వారా ఆరోగ్యవంతమైన జీవనాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ మంగ, 15వ వార్డు కౌన్సిలర్ అబ్దుల్లా, జిల్లా నాయకులు కట్కూర్ భీమ్‌రావు, రాము మహమ్మద్, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మంచిర్యాలలో నీట్ పరీక్ష కేంద్రాలను సందర్శించిన పోలీస్ కమిషనర్



మంచిర్యాల, 21, జూన్ (ప్రజాజ్యోతి):మంచిర్యాల పట్టణంలో ఆదివారం నిర్వహించిన నీట్ పరీక్ష సందర్భంగా రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, డీసీపీ ఎ. భాస్కర్‌తో కలిసి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన సీపీ, పరీక్షకు హాజరైన అభ్యర్థుల సంఖ్య, భద్రతా ఏర్పాట్లపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరీక్షలు సజావుగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు. అలాగే పరీక్షలు ముగిసిన అనంతరం ప్రశ్నపత్రాలు, ఇతర పరీక్షా సామగ్రిని సురక్షితంగా తరలించే విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ, మంచిర్యాల పట్టణంలో మొత్తం ఐదు పరీక్షా కేంద్రాల్లో నీట్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు ట్రాఫిక్ నిర్వహణతో పాటు పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు .అదేవిధంగా పరీక్షలు ముగిసిన అనంతరం ప్రశ్నపత్రాలు, ఇతర పరీక్షా సామగ్రిని భద్రంగా గమ్యస్థానాలకు తరలించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం అన్ని పరీక్షా కేంద్రాల్లో ప్రశాంత వాతావరణం నెలకొని ఉందని, విద్యార్థులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని కోరారు.

# బదిలీపై మందమర్రికి వెళుతున్న శ్రీరాంపూర్ ఏరియా క్వాలిటీ మేనేజర్ కే. వెంకటేశ్వర్ రెడ్డికి ఘన సన్మానం





మంచిర్యాల, 21, జూన్ (ప్రజా జ్యోతి):బదిలీపై మందమర్రి ఏరియాకు వెళుతున్న శ్రీరాంపూర్ ఏరియా క్వాలిటీ మేనేజర్ కే. వెంకటేశ్వర్ రెడ్డి గారిని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ ఘనంగా సత్కరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా కే. వెంకటేశ్వర్ రెడ్డి మందమర్రి ఏరియాకు బదిలీ కాగా, శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం నుంచి రిలీవ్ అవుతున్న సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జీఎం మునిగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ, శ్రీరాంపూర్ ఏరియాలో వివిధ హోదాల్లో పనిచేస్తూ సంస్థ అభివృద్ధికి వెంకటేశ్వర్ రెడ్డి విశేష సేవలు అందించారని కొనియాడారు. ముఖ్యంగా క్వాలిటీ నిర్వహణలో ఆయన అందించిన సేవలు సంస్థకు ఎంతో ఉపయోగపడ్డాయని పేర్కొన్నారు. ఆయన ప్రత్యేక దృష్టి, సమర్థత కారణంగానే సింగరేణిలో క్వాలిటీ పరంగా శ్రీరాంపూర్ ఏరియా ముందు వరుసలో నిలిచిందని అన్నారు. అధికారిగా మాత్రమే కాకుండా అధికారుల సంఘం శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షునిగా కూడా ఆయన అందించిన సేవలు ప్రశంసనీయమని వివిధ విభాగాల అధికారులు అభిప్రాయపడ్డారు. విధుల పట్ల అంకితభావంతో పాటు సహచరులతో సత్సంబంధాలు కొనసాగిస్తూ అందరికీ ఆదర్శంగా నిలిచారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం ఎన్. సత్యనారాయణ, ఏరియా ఇంజనీర్ రమణరావు, ఏజీఎం (ఫైనాన్స్) సుమలత, డీజీఎం (పర్సనల్) ఎస్. అనిల్ కుమార్, శ్రీరాంపూర్ ఓసీపీ ప్రాజెక్ట్ ఆఫీసర్ సీహెచ్. వెంకటేశ్వర్లు, ఐకే ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఏ.వి. రెడ్డి, ఎస్ఆర్పీ గ్రూప్ ఏజెంట్ రవికుమార్, డీజీఎం (ఫారెస్ట్) హరినారాయణ, డీజీఎం (ఐఈడీ) రాజన్న, ఎస్టేట్స్ మేనేజర్ వరలక్ష్మి, పర్చేజ్ ఆఫీసర్ చంద్రశేఖర్, సీహెచ్పీ ఇన్‌చార్జ్ చంద్రలింగం, సీనియర్ ఐటీ ప్రోగ్రామర్ శ్రీనివాస్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

# యోగా ప్రతి ఒక్కరికీ అవసరం

### యోగా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతతను కూడా అందిస్తుంది

### ఘనంగా 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం




మంచిర్యాల, 21, జూన్ (ప్రజాజ్యోతి):యోగా ప్రతి ఒక్కరికీ అవసరమని తెలిపారు. యోగా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతతను కూడా అందిస్తుందని యోగా మాస్టర్ లు తెలిపారు. 12 వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర రాజధాని విశ్వనగరం భాగ్యనగర్ హైదరాబాద్ నాంపల్లిలోని జిల్లా న్యాయ సేవల సంస్థ, హైదరాబాద్ సెషన్స్ డివిజన్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి న్యాయమూర్తులు, న్యాయవాదులు, న్యాయ విభాగ అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో హాజరై యోగా సాధనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మంచిర్యాలకు చెందిన యోగా మాస్టర్, న్యాయవాది కొట్టే నటేశ్వర్ అలాగే డాక్టర్ పూనమ్‌లు యోగా, ప్రాణాయామం, ధ్యానంల ప్రాముఖ్య త, వాటి వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. అలాగే వివిధ యోగా ఆసనాలు, ప్రాణాయామ విధానాలను ప్రత్యక్షంగా చేసి చూపిస్తూ అందరితో కలిసి యోగా సాధన చేపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నేటి ఆధునిక జీవనశైలిలో ఒత్తిడి, మానసిక ఆందోళనలు, అనారోగ్య సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో యోగా ప్రతి ఒక్కరికీ అవసరమని తెలిపారు. యోగా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతతను కూడా అందిస్తుంద న్నారు. తదనంతరం న్యాయమూర్తులు, న్యాయవాదులు, న్యాయ విభాగ అధికారులు మరియు సిబ్బంది యోగా మాస్టర్లను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా యోగా మాస్టర్, న్యాయవాది నటేశ్వర్ మాట్లాడుతూ, యోగా అనేది చిన్నా పెద్దా, మహిళలు, వృద్ధులు అనే తారతమ్యం లేకుండా ప్రతి ఒక్కరూ ఆచరించవచ్చని తెలిపారు. ప్రతి రోజు కొంత సమయం యోగాకు కేటాయించడం ద్వారా ఆరోగ్యంగా ఉండటంతో పాటు అనారోగ్య సమస్యలను దూరం చేసుకోవచ్చని, "రోగం భోగం వద్దు... యోగం ముద్దు" అనే నినాదంతో యోగా ప్రాముఖ్యతను వివరించారు.

# సింగరేణిలో అత్యంత పకడ్బందీగా బొగ్గు రవాణా

## ప్రతి టన్ను బొగ్గుపై పటిష్ట పర్యవేక్షణ -- అత్యాధునిక సాంకేతికతతో పారదర్శక వ్యవస్థ

### సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్) యాజమాన్యం

**మంచిర్యాల, 21, జూన్ (ప్రజాజ్యోతి):** సింగరేణిలో బొగ్గు చోరీకి గురైందని, బొగ్గు కనిపించడం లేదంటూ ఇటీవల కొన్ని మీడియా సంస్థల్లో వస్తున్న కథనాల్లో ఎలాంటి వాస్తవం లేదని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్) యాజమాన్యం స్పష్టం చేసింది. సంస్థలో బొగ్గు ఉత్పత్తి నుంచి నిల్వలు, రవాణా, విక్రయాల వరకు ప్రతి ప్రక్రియ అత్యంత పారదర్శకంగా, ఆధునిక సాంకేతిక వ్యవస్థల పర్యవేక్షణలో జరుగుతోందని వెల్లడించింది. సింగరేణి భవన్‌లో ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో సంస్థ అధికారులు బొగ్గు రవాణా, భద్రతా వ్యవస్థలకు సంబంధించిన కీలక వివరాలను వెల్లడించారు. గనుల్లో బొగ్గు ఉత్పత్తి అయిన క్షణం నుంచి వినియోగదారుడి వద్దకు చేరే వరకు ప్రతి దశ డిజిటల్ విధానంలో నమోదవుతోందని తెలిపారు. ఉత్పత్తి అయ్యే బొగ్గులో సుమారు 85 శాతం రైల్వే మార్గం ద్వారా, మిగిలిన 15 శాతం రోడ్డు మార్గం ద్వారా సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. బొగ్గు కేటాయింపులు ఎస్‌ఏపీ ఆధారిత సమగ్ర వ్యవస్థ ద్వారా జరుగుతున్నాయని, వినియోగదారుడు, గని, పరిమాణం, సరఫరా తేదీ తదితర వివరాలు ముందుగానే డిజిటల్ రూపంలో నమోదవుతాయని తెలిపారు. ప్రతి టన్ను బొగ్గుకు సంబంధించిన సమాచారం కోల్‌నెట్, ఎస్‌ఏపీ తదితర ఆన్‌లైన్ వ్యవస్థల ద్వారా నిరంతర పర్యవేక్షణలో ఉంటుందని ఆపరేషన్స్ విభాగం ఉన్నతాధికారులు వెల్లడించారు. రోడ్డు మార్గంలో బొగ్గు రవాణా చేసే ప్రతి వాహనాన్ని ఎలక్ట్రానిక్ వెయిబ్రిడ్జ్‌ల వద్ద తూకం వేస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఆర్ఎఫ్ఐడీ ఆధారిత బూమ్ బ్యారియర్లు, జీపీఎస్ / జీపీఆర్ఎస్ ట్రాకింగ్ వ్యవస్థలు, జియోఫెన్సింగ్ సాంకేతికతల ద్వారా వాహనాల కదలికలను రియల్ టైమ్‌లో పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. రైల్వే మార్గంలో కూడా ప్రతి వ్యాగన్ లోడింగ్, డిస్పాచ్ వివరాలు డిజిటల్‌గా నమోదవుతున్నాయని అధికారులు వెల్లడించారు. గనులు, కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్లు (సీహెచ్‌పీలు), వెయిబ్రిడ్జ్‌లు, రైల్వే సైడింగ్‌లు, స్టాక్ యార్డులు, ప్రవేశ-నిష్క్రమణ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు, ఆర్ఎఫ్ఐడీ వ్యవస్థలు, చెక్‌పోస్టులు, ఫ్లయింగ్ స్క్వాడ్లు, భద్రతా సిబ్బంది 24 గంటల పర్యవేక్షణ నిర్వహిస్తున్నట్లు వివరించారు .అదేవిధంగా ఆకస్మిక తనిఖీలు, ప్రత్యేక గస్తీలు కూడా నిరంతరం కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఆర్ఎఫ్ఐడీ, జీపీఎస్, సీసీటీవీ, కోల్‌నెట్, ఎలక్ట్రానిక్ వెయిబ్రిడ్జ్‌లు, సింగరేణి సెక్యూరిటీ, ఫ్లయింగ్ స్క్వాడ్లు, హోంగార్డ్ చలానాలు, టాస్క్‌ఫోర్స్ పర్యవేక్షణ వంటి బహుళస్థాయి భద్రతా వ్యవస్థల మధ్య జరుగుతున్న బొగ్గు ఉత్పత్తి-రవాణా ప్రక్రియలో బొగ్గు చోరీకి గురికావడం లేదా కనిపించకపోవడం వంటి ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని సింగరేణి యాజమాన్యం స్పష్టం చేసింది.

# నెల్కి వెంకటాపూర్‌లో వైభవంగా పెద్దమ్మ తల్లి బోనాలు

## గ్రామంలో వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ



**దండేపల్లి, జూన్ 21 (ప్రజాజ్యోతి):** మండల పరిధిలోని నెల్కి వెంకటాపూర్ గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ తల్లి బోనాల ఉత్సవాలు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఏటా సాంప్రదాయ బద్ధంగా నిర్వహించే ఈ ఉత్సవాలకు ఈసారి గ్రామస్తులు, భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.

**ఘనంగా బోనాల సమర్పణ**

ఆదివారం ఉదయం నుంచే గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ముదిరాజ్ సంఘం మహిళలు, గ్రామ ఆడపడుచులు సాంప్రదాయ దుస్తులు ధరించి, తలలపై బోనాలతో గ్రామంలో ఊరేగింపుగా బయలుదేరారు. మంగళవాయిద్యాలు, పోతురాజుల విన్యాసాలు, డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగింపు కోలాహలంగా సాగింది. గ్రామ పురవీధుల గుండా సాగిన ఈ ఊరేగింపు అనంతరం భక్తులు పెద్దమ్మ తల్లి ఆలయానికి చేరుకున్నారు.

**అమ్మవారికి ప్రత్యేక పూజలు**

ఆలయానికి చేరుకున్న మహిళలు అమ్మవారికి బోనాలను సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. ముదిరాజ్ సంఘం ప్రతినిధులు అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, కుంకుమార్చనలు నిర్వహించారు. గ్రామం పాడిపంటలతో వర్ధిల్లాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు సంఘం నాయకులు తెలిపారు."మా ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ప్రతి ఏటా పెద్దమ్మ తల్లి బోనాలను ఎంతో భక్తితో నిర్వహిస్తాం. అమ్మవారి కృపతో గ్రామంలోని ప్రజలందరికీ ఎలాంటి ఇబ్బందులు కలగకూడదని, అందరూ బాగుండాలని పూజలు చేశాం."

**ముదిరాజ్ సంఘం ప్రతినిధులు**

**అన్నదాన కార్యక్రమం**

బోనాల ఉత్సవాన్ని పురస్కరించుకుని ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో భక్తులకు, గ్రామస్తులకు భారీగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం ముఖ్య నాయకులు, యువకులు, గ్రామ పెద్దలు మరియు పరిసర ప్రాంతాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాన్ని విజయవంతం చేశారు. ఉత్సవాలు ప్రశాంతంగా ముగియడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.

## ఆదివాసి బిడ్డలకు భీమా కుసుమ్ పూర్ గ్రామంలో లేబర్ ఇన్సూరెన్స్



**ఖానాపూర్ జూన్ 21 (ప్రజా జ్యోతి)** ఖానాపూర్ మండలంలోని గిరిజన ఆదివాసి బిడ్డలకు అనర్థాలు జరగకుండా ముందస్తుగా కార్మిక భీమా, లేబర్ ఇన్సూరెన్స్ పథకాన్ని అమలు చేస్తున్నారు ఈ సందర్భంగా నిర్మల్ కు చెందిన ప్రముఖ డాక్టర్ రమేష్ రెడ్డి ఆర్థిక సాయంతో గతంలో ఖానాపూర్ మండలంలోని పాత ఎల్లాపూర్ తో పాటు పలు గ్రామాల్లో సొంత ఖర్చులతో ఇన్సూరెన్స్ పథకాన్ని ప్రారంభించిన అక్కడి సర్పంచ్ ఏలేటి ప్రశాంత్ రెడ్డి స్ఫూర్తి మేరకు పూర్తిస్థాయిలో ఆదివాసి గిరిజన బిడ్డలకు ఈ బీమా వర్తింపజేయాలను ఉద్దేశంతో మండలంలోని కోలం గూడా ఎస్టి గ్రామపంచాయతీలో గల మూడు గ్రామాల్లోని ప్రజలకు ఆదివారం ఇన్సూరెన్స్ అధికారులతో సర్పంచ్ అర్జున్ ఆధ్వర్యంలో కుసుంపూర్ గ్రామం వెళ్లి బీమా చేయించారు గ్రామపంచాయతీ పరిధిలోని మూడు గ్రామాల్లో సుమారు 200పై చిలుకు ప్రజలు ఉన్నారని వీరందరికీ కార్మిక ఇన్సూరెన్స్ ద్వారా లబ్ది కలిగేందుకు డాక్టర్ రమేష్ రెడ్డి పూనుకున్నారని సర్పంచ్ అర్జున్ తెలిపారు ఈ కార్యక్రమంలో పాత ఎల్లాపూర్ సర్పంచ్ ప్రశాంత్ రెడ్డి కొత్తపేట సర్పంచ్ నరేష్ తదితరులు పాల్గొన్నారు ఆదివారం కుసుంపూర్ గ్రామాన్ని ముగించుకొని తదుపరి మిగతా గ్రామాల్లో ఇలాగే కొనసాగిస్తామని తెలిపారు ఇన్సూరెన్స్ పథకం అమలుపట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

## యోగా.. ఓ దివ్యౌషధం





**మామడ జూన్ 22 (ప్రజా జ్యోతి)** యోగా దినోత్సవం సందర్భంగా మామడ మండలంలోని పొన్కల్ గ్రామంలో 12 అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంతో ప్రారంభించి ట్రైనర్ యుగంధర్ ఆధ్వర్యంలో యోగ ఆసనాలతో విద్యార్థులకు, గ్రామ ప్రజలకు నేర్పించారు. వైద్యంతో తగ్గని ఎన్నో దీర్ఘకాలిక వ్యాధులు యోగాతో నయ మవుతున్నాయని యోగ ట్రైనర్ యుగంధర్ అన్నారు.యోగ అభ్యాసం. ఇది మనస్సు, శరీరం మరియు ఆత్మల మధ్య సమతుల్యతను తీసుకురావడానికి సహాయ పడుతుంది ఫార్మసిస్ట్ మౌనిక అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిట్యాల లక్ష్మీ, మరియు చిట్యాల రాజరెడ్డి, సుధాకర్ రెడ్డి, బెజ్జంకి రాజు, ఎలిగేటి వంశీ కృష్ణ నేత , టి.శ్రీనివాస్ తో పాటు గ్రామ పల్లె దవాఖాన సిబ్బంది ఏఎన్ఎం గంగా, సెకండ్ ఏఎన్ఎం స్వరూప, మరియు అంగన్వాడీ టీచర్ సలోమి, గ్రామ ఆశ వర్కర్లు పద్మ, సుమలత తో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.అనంతరం యోగ ట్రైనర్ యుగంధర్ కు, ఫార్మసిస్ట్ మౌనికకు, మరియు వైద్య సిబ్బందికి గ్రామ నాయకులు శాలువాతో సన్మానించారు.

# గుండి గ్రామ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లిన మాజీ సర్పంచ్ దత్తు

## అసంపూర్తి వంతెన నిర్మాణంపై ప్రత్యేక దృష్టి: ఎమ్మెల్యే

## గుండి వంతెనకు రీ-ఎస్టిమేట్ ప్రక్రియ వేగవంతం

**ఆసిఫాబాద్, జూన్ 21 ప్రజాజ్యోతి** ఆసిఫాబాద్ మండలం గుండి గ్రామంలోని అసంపూర్తిగా ఉన్న వంతెన నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు తెలిపారు. గుండి గ్రామ మాజీ సర్పంచ్ సెండె దత్తు ఆదివారం ఎమ్మెల్యేను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి గ్రామ సమస్యలను వివరించారు. ముఖ్యంగా గుండి పెద్దవాగుపై నిర్మాణంలో నిలిచిపోయిన వంతెన పనులను పూర్తి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గుండి గ్రామ సమస్యలు, వంతెన నిర్మాణం అంశంపై తనకు పూర్తి అవగాహన ఉందన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి జిల్లా పర్యటన సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో కూడా గుండి వంతెన సమస్యను ప్రస్తావించినట్లు తెలిపారు. వంతెన నిర్మాణానికి అవసరమైన రీ-ఎస్టిమేట్ సిద్ధం చేయాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించగా, వారు ఇప్పటికే స్థల పరిశీలన పూర్తి చేశారని చెప్పారు. నిధుల మంజూరు ప్రక్రియ కొనసాగుతోందని, వర్షాకాలం ముగిసిన వెంటనే గుండి వంతెనతో పాటు అనుసంధాన రహదారుల నిర్మాణ పనులు ప్రారంభమయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. గ్రామ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధి అంశాలపై కూడా ఎమ్మెల్యేతో మాజీ సర్పంచ్ దత్తు చర్చించారు.



# జూన్ 23 న "రాష్ట్ర వ్యాప్త పాఠశాలల బంద్"

ప్రైవేట్,కార్పొరేట్ విద్యా మాఫియాకు బ్రాండ్ అంబాసిడర్ లా వ్యవహరిస్తున్న రేవంత్ రెడ్డి...

రేషనలైజేషన్ పేరుతో 23000 ప్రభుత్వ స్కూళ్ల మూసివేతకు కుట్ర...

ప్రైవేట్,కార్పొరేట్ విద్యాసంస్థల విచ్చలవిడి ఫీజుల దోపిడీకి ప్రభుత్వం రెడ్ కార్పెట్...

అటకెక్కిన విద్యాహక్కు చట్టం...ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కరువు...

ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థులకు ఇంకా అందని స్కూల్ యూనిఫామ్స్...

**మామడ జూన్ 22 ( ప్రజా జ్యోతి)** తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాల విద్య నిర్వీర్యం అవుతున్నది.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా విద్యాశాఖ మంత్రిగా ఉండి ప్రైవేట్,కార్పొరేట్ పాఠశాలలకు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నాడని, ప్రభుత్వ పాఠశాలల ఎత్తివేతకు కుట్ర చేస్తూ... ప్రైవేట్,కార్పొరేట్ పాఠశాలల ఆర్థిక దోపిడీకి కొమ్ముకాస్తున్న రాష్ట్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా ఆధ్వర్యంలో జూన్ 23న రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల బంద్. ఈ సందర్భంగా ఇందూర్ విభాగ్ కన్వీనర్ కైరి శశిశీధర్ మాట్లాడుతూ.." రేవంత్ రెడ్డి పేద విద్యార్థులకు విద్యను దూరం చేయాలని కుట్ర చేస్తున్నాడని, అందుకే రేషనలైజేషన్ పేరుతో 23000ల పాఠశాలలను మూసేందుకు కంకణం కట్టుకున్నాడని ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలకు ఏజెంట్ లావ్యవహరిస్తున్నాడని, విచ్చలవిడిగా ఫీజుల దోపిడీకి పాల్పడుతున్న ప్రైవేట్ పాఠశాలలకు ప్రభుత్వం రెడ్ కార్పెట్ పరిచిందని ఎద్దేవా చేశారు.వెంటనే ప్రభుత్వం ఫీజుల దోపిడీని అరికట్టి, ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు,కార్పొరేట్ స్కూళ్లలో పేద విద్యార్థులకు ఉచితంగా 25% సీట్లను అందించే విద్యాహక్కు చట్టాన్ని ప్రభుత్వం అటకెక్కించిందన్నారు. రాష్ట్రంలో పాఠశాలలు పర్యవేక్షణ లేకుండా నడుస్తున్నాయని కావున ఖాళీగా ఉన్న ఎంఈఓ,డిఈఓ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒక పర్మిషన్ పేరు మీద పలు బ్రాంచ లు నిర్వహిస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గర నుంచి ఆర్థిక దోపిడీకి పాల్పడుతు సరస్వతి నిలయాలు లాంటి పాఠశాలలను వ్యాపార కేంద్రాలుగా మారుస్తున్నటువంటి ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించి ఖాళీగా ఉన్న టీచింగ్,నాన్ టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని,




అదేవిధంగా గురుకుల పాఠశాలలకు పక్కా భవనాలు నిర్మించాలని ఫుడ్ పాయిజన్ కి తావులేకుండా విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని,చీజూ 2020ని,విద్య హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.పాఠశాలలు రీ ఓపెన్ అయిన ఇంతవరకు విద్యార్థులకు స్కూలు యూనిఫామ్స్ ఇవ్వకపోవడం రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యా వ్యవస్థ పై చూపిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిదర్శనం అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో "బ్రేక్ ఫాస్ట్ స్కీమ్" ను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ విద్యా వ్యవస్థను గాడి పెట్టాలని ప్రైవేట్,కార్పొరేట్ విద్యాసంస్థల ఆర్థిక దోపిడిని నియంత్రించి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.లేనిపక్షంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు.విద్యార్థి వ్యతిరేక విధానాలకు పాల్పడుతూ రాష్ట్రంలో విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నటువంటి రాష్ట్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా ఈ నెల 23న ఏబీవీపీ పాఠశాలల బందుకు పిలుపునిచ్చింది.కావునా విద్యార్థులు,వారి తల్లిదండ్రులు ఈ బంద్ కు సహకరించి విజయవంతం చేయాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో అక్షయ్,దుర్గ దాస్,నితీష్,సమీర్ హరి, వంశీ, సాయి,అభి, అక్షయ్, జశ్వంత్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## యోగా దినోత్సవం సందర్భంగా వాకర్స్ గ్రూప్ చే

పారిశుద్ధ సిబ్బందికి రైన్ కోట్ల పంపిణీ



**ఖానాపూర్ జూన్ 21 (ప్రజా జ్యోతి)** ప్రపంచ యోగ దినోత్సవ సందర్భంగా నిర్మల్ జిల్లా ఖానాపూర్ వాకర్స్ గ్రూప్ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ పార్కులో ఆదివారం ఉదయం రైన్ కోట్లను పంపిణీ చేశారు ఈ సందర్భంగా వాసవి క్లబ్ వాకర్స్ గ్రూప్ ఆధ్వర్యంలో యోగ సమావేశం జరిగింది యోగ వల్ల మానవ శరీరం పూర్తి ఆరోగ్యంగా కలిసి వస్తుందని ప్రతిరోజు ఎలాంటి ఆర్థిక ఖర్చు లేకుండా అరగంట పాటు యోగా చేసుకోవాలని తద్వారా అందరూ ఆరోగ్యంగా ఉండాలని పలువురు కోరారు ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య వాసవి క్లబ్ నాయకులు వాకర్స్ క్లబ్ సభ్యులు మాజీ మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్ మహాజన్ జితేందర్ వైభీమ్రావు తూమ్ చరణ్ బండారి రాజా కిషన్ మధుకర్ ప్రకాష్ సురేష్ రాజేశ్వర్ కొమురయ్య ఊషన్న పరిశు ద్ధ కార్మికులు తదితరులు పాల్గొన్నారు

## సోనాల పూర్వ విద్యార్థికి గౌరవ డాక్టరేట్ ప్రధానోత్సవం



**సోనాల, జూన్ 21( ప్రజాజ్యోతి ):**న్యాయ కోవిదుడు పుట్టింది ఒక మామూలు మధ్యతరగతి కుటుంభం అమ్మానాన్నలు నిరక్ష రాస్యులు, అయినా అధైర్య పడకుండా ఉన్నత చదువులు చదివి, అందరికీ ఆదర్శంగా నిలిచాడు. మాతృమూర్తి గిర్మబాయ్ స్వర్గీయులు కావడంతో అమ్మ మీద ప్రేమతో సంగెం చారిటబుల్ ట్రస్ట్ నెలకొల్పి వివిధ సేవా కార్యమాలు చేపట్టి ప్రజల్లో మన్ననలు పెందుతున్నారు, వారి సేవలకు ఎన్నో అవార్డులు లభించాయి. ఈరోజు హైదరాబాదు లో ఈ పి బి యూనివర్సిటీ వెల్లింగ్టన్ సౌతాఫ్రికా వారు, ఆర్ట్ ఆఫ్ లివింగ్ మరియు వందన యూత్ వాలంటీర్ ఆర్గనైజేషన్ సంయుక్తంగా "గౌరవ డాక్టరేట్ 'డిగ్రీ తో సన్మానం చేశారు. ఈ రోజు హైదరాబాద్ లోని తెలంగాణా సర్వత్రిక పరిషత్ లో ప్రముఖ సినీ నిర్మాత శ్రీ రేలంగి నరసింహారావు , ప్రముఖ సినీ నిర్మాత ఆకుల రమేష్ ,వందన యూత్ ఆర్గనైజషన్ అధ్యక్షులు శ్రీ పులి ప్రసాద్ శ్రీ జనార్దన్ శ్రీమతి అభినందన శుభాష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు. సామాన్య మధ్యతరగతి కుటుంభంలో పుట్టి అంచలంచలుగా ఎదుగుతూ, సుధీర్ కుమార్ సంగెం ఈరోజు డాక్టర్ డిగ్రీ పొందడం పట్ల జిల్లా ప్రజలు తోటి న్యాయవాదులు, సోనాల గ్రామప్రజలు హర్షం వ్యక్త పరుస్తున్నారు. ఆయన మాట్లాడుతూ ఈ డాక్టరేట్ డిగ్రీ తో మరింత బాధ్యత పెరిగింది అని పేర్కొన్నారు.

## 26 న హైదరాబాద్ లో పద్మశాలి ఉద్యోగుల రాష్ట్ర సదస్సు

**జిల్లా అధ్యక్షులు బూర ఉమా శంకర్**



**ఖానాపూర్, జూన్ 21 ( ప్రజా జ్యోతి )** ఈనెల 26న హైదరాబాదులోని ఎల్బీనగర్ స్వకుల శాలి సమాజ భవనములో తెలంగాణ రాష్ట్ర పద్మశాలి ఉద్యోగుల సదస్సు ఈ నెల 26న నిర్వహించడం జరుగుతుందని నిర్మల్ జిల్లా పద్మ శాలి ఉద్యోగుల సంఘ అధ్యక్షులు బూర ఉమా శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు ఈ కార్య క్రమం రాష్ట్ర అధ్యక్షులు ఈగ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సదస్సు కొనసాగుతుందని, పద్మశాలి ఉద్యోగుల సంఘశీ ద్వారా చేపడుతున్న ఈ సదస్సులో సంఘ బలోపేతం గురించి చర్చించడం జరుగుతుందని తెలిపారు. సదస్సు కు నిర్మ ల్ జిల్లా పద్మశాలి ఉద్యోగులందరూ పాల్గొని సదస్సు విజయం వంతం చేయాలని జిల్లా అధ్యక్షులు ఉమా శంకర్ కోరారు.

## ఎస్ ఐ ఆర్ కార్యక్రమంపై ప్రజ ల్లో చైతన్యం కోసం నేడు 2 కే రన్

**ఓటర్ల జాబితా ప్రత్యేక సవర ణకు ప్రజల భాగస్వామ్యం పెంపొందించడమే లక్ష్యం**

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 21, (ప్రజా జ్యోతి)**స్వచ్ఛమైన ఓటర్ల జాబితా ల క్ష్యంగా చేపడుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎ స్ఐఆర్) కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కల్పించేందు కు జూన్ 22 (సోమవారం)ఉదయం 6 గంటలకు స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో "2కే రన్" నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రాజర్షిషా తెలిపారు.స్వీప్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహి స్తున్న ఈ 2కే రన్ ఇందిరా ప్రి యదర్శిని స్టేడియం నుంచి ప్రారంభమై కలెక్టరేట్ చౌక్, ఎ న్టీఆర్ చౌక్ మీదుగా తిరిగి స్టే డియానికి చేరుకుంటుందని పేర్కొన్నా రు.ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రాధాన్యతను చాటిచెప్పే ఈ అవగాహన కార్యక్రమంలో ప్రజలు, యువత, విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొని, ఓటర్ల జాబితా ప్ర త్యేక సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జి ల్లా కలెక్టర్ పిలుపు నిచ్చారు.

## లక్ష్మణ చాంద విద్యార్థికి బాసర ట్రిబుల్ ఐటీలో సీటు



**లక్ష్మణ చాంద, జూన్ 21(ప్రజా జ్యోతి)**లక్ష్మణ చాంద మండల కేంద్రమైన ఉన్న త పాఠశాలలో పదవ తరగతి వరకు చదివిన రాథోడ్ అనీష్ కు బాసర ట్రిబు ల్ ఐటీ స్పోర్ట్స్ కోటాలో సీటు వచ్చినట్టు పాఠ శాల ప్రధా నోపాధ్యాయు లు రాజు నాయ క్ తెలిపారు. తమ పిల్లలను కూడ ప్రభుత్వ పాఠశాలకు పంపా లని విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. ట్రిబుల్ ఐటీ లో సీటు ను పొందిన విద్యార్థిని గ్రామస్తులు పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

# బీఆర్ఎస్ పార్టీలోకి భారీ చేరికలు

## కండువాలు కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్



**నేరడిగొండ, జూన్ 21( ప్రజా జ్యోతి):**బోథ్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని గుత్పల గ్రామానికి చెందిన దాదాపు 60 మంది పెద్దలు, యువకులు ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన ముఖ్యులు మాట్లాడుతూ... తెలంగాణ భవిష్యత్తు ఒక్క బీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమని నమ్మి తాము పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు. తమ ప్రాంత ఎమ్మెల్యే అనిల్ అన్న అండతో గుత్పల గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకుంటామని వారు ధీమా వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ... బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అద్భుత అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి ప్రజలు తిరిగి బీఆర్ఎస్ వైపు ఆకర్షితులవుతున్నారని అన్నారు. పార్టీ కార్యకర్తలే బీఆర్ఎస్‌కు అసలైన బలమని, ప్రజల సమస్యల పరిష్కారానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. గ్రామ అభివృద్ధి కోసం అందరం సమిష్టిగా పనిచేస్తూ ప్రజల ఆశయాలను నెరవేర్చేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పార్టీ నమ్ముకుని వచ్చిన ప్రతి ఒక్కరికీ సముచిత గుర్తింపు, ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు. ఉడుగుల సురేష్, బట్టు నర్సయ్య, ఒడ్డెపల్లి సురేష్, దావుల ఆదేళ్ళు, ఉడుగుల పెద్ద గంగయ్య, కొండ గంగయ్య, బోగి మల్లయ్య, దశకంటి రాములు, దావుల శివయ్య, సుధీర్, శ్రీకాంత్, సతీష్, నవీన్, ప్రవీణ్, నగేష్, సంజు, లక్ష్మణ్, భీంరావ్, భాస్కర్, సాగర్, కృష్ణ, సంతోష్, రాజు తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ శివారెడ్డి, మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, సోమేశ్, రాథోడ్ సురేందర్, సుజీల్, సాబ్లే సంతోష్, బాబులాల్, కైలాష్ తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గాంధీ పార్కులో చిన్నారుల రైలు పునఃప్రారంభం

## ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్ పర్సన్‌లతో కలిసి ప్రారంభించిన కలెక్టర్ రాజర్షిషా







**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 21,( ప్రజా జ్యోతి)** సమిష్టి కృషితో చిన్నారుల రైలును తిరిగి అందుబాటు లోకి తీసుకురావడం జరిగింద ని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ఆదివారం స్థానిక గాంధీ పార్కులో చిన్నారుల రైలు ను స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూషలతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారం భించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అదిలాబాద్ పట్టణానికే కాకుండా చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు ఈ పార్కు ఒక పెద్ద ఆహ్లాదకర ప్రాంతం లాంటిదన్నారు. సెలవు రోజుల్లో పిల్లలు, పెద్దలు ఇక్కడి రైడ్స్, స్వింగ్స్‌తో వినోదం పొందుతున్నారని చెప్పా రు. ఎమ్మెల్యే, చైర్ పర్సన్ సూచనల మేరకు 'అర్బన్ ఛాలెం జ్ ఫండ్', 'టి.ఎఫ్.ఐ.డి.సి ని ధులతో పార్కును మరింతగా అభివృద్ధి చేయడానికి ప్రణా ళికలు సిద్ధంగా ఉన్నాయని, త్వరలోనే ఇక్కడ మరిన్ని వినోద సౌకర్యాలు మెరుగు పరు స్తామని స్పష్టం చేశారు. అందరి సమిష్టి కృషితో ఈ రైలును మళ్లీ ప్రజలకు అందుబా టులోకి తీసుకురావడం జరిగిందని తెలిపారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ ,గత ఏడెనిమిది సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న చిన్న పిల్లల రైలును కలెక్టర్ ప్రత్యేక చొరవతో ఆదివారం పునఃప్రారంభించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పార్కులో పిల్లలందరికీ ఉల్లాసభరిత మైన వాతావరణాన్ని కల్పించ డమే తమ ధ్యేయమని, ఆదిలాబాద్ పట్టణ ప్రజలకు ఉదయం, సాయంత్రం వేళల్లో వా కింగ్ చేయడానికి ప్రస్తుతం ఉన్న స్టేడియంలో స్థలం సరిపో వడం లేదని, ఈ సమస్యను అధిగమించడానికి గాంధీ పా ర్క్ చుట్టూ ఉన్న ప్రహరీ గోడ వైపు దాదాపు 15 నుండి 20 ఫీట్ల వెడల్పుతో ఒక అధునా తన వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేయాలనే ఆలోచనతో ఉన్న ట్లు వెల్లడించారు. దీనికోసం మున్సిపాలిటీ పరంగా ప్రత్యేక ఆర్థిక వనరులను సమకూర్చు కునే ప్రయత్నాలు ఇప్పటికే జ రుగుతున్నాయని తెలిపారు. పట్టణ అభివృద్ధికి అవసర మైన నిధుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ముందుకు వెళ్తున్నట్లు వివరించారు. అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద కేంద్ర ప్రభుత్వం నుండి దాదాపు 800 కోట్ల రూపాయల నిధులను సాధించే విషయమై ఇప్పటికే కేంద్ర మంత్రితో పాటు రాష్ట్ర ము ఖ్యమంత్రితో మాట్లాడటం జరిగిందని చెప్పారు. ఈ ప్రాజె క్టును వీలైనంత త్వరలోనే పట్టణానికి తీసుకువచ్చేందు కు తన వంతు ప్రయత్నం చే స్తున్నట్లు భరోసా ఇచ్చారు. మున్సిపల్ చైర్ పర్సన్ మా ట్లాడుతూ, పిల్లల ఆహ్లాద వాతావరణం కొరకు పార్కును మరింత అభివృద్ధి పరచేందుకు నిధులు కేటా యిస్తామన్నారు. ఈ కార్యక్ర మంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజే శ్వర్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, మున్సిపల్ చైర్ పర్సన్, కౌన్సిలర్ జ్యోతి, చిన్నారులు, తదితరులు పాల్గొన్నారు.

# పోన్కల్ లో ఉచిత జిఐ క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం



**మామడ జూన్ 22 ( ప్రజా జ్యోతి)** మామడ మండలంలోని పొన్కల్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టీం విమలాకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత జి ఐ క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో సిబిపి, క్రియాటినిన్, ఆర్బిఎస్, సీరం ఎల్ ఎఫ్ టి, లిపిడ్ ప్రొఫైల్, ఎండోస్కోపీ అల్ట్రాసౌండ్, ప్రోక్టోస్కోపీ, ఈసీజీ, 2డి ఎకో, మొదలైన వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ఈ శిబిరానికి దాదాపు 300 మంది పైగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వాహకులు డాక్టర్ విమలాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలోనే క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహించుకోవడం ఎంతో అవసరమని అన్నారు. కార్యక్రమానికి సహకరించిన డాక్టర్లకు, వైద్య సిబ్బందికి, వాలంటీర్లకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ విద్యా అభివృద్ధి కమిటీ సభ్యులు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# సిసి రోడ్డు నిర్మాణనికి నిధులు మాంజూరు

**సర్పంచ్ జక్కుల గజేందర్:-**



**కుంటాల జూన్ 21 (ప్రజాజ్యోతి)**నిరంతరం శ్రమిస్తూ గ్రామాన్ని అభివృద్ధి పరచడమే లక్ష్యమని  యువ సర్పంచ్ జక్కుల గజేందర్ అన్నారు, మండల కేంద్రమైన కుంటాలలో గ్రామస్తులు నిరంతరం నడిచే ప్రధాన దారులలో సిసి, రోడ్డు మరియు డ్రెనేజి వ్యవస్థ ప్రమాధకరంగ ఉన్నయని వర్షకలంలో వరద నీరు రోడ్ల పై నిలుస్తు ప్రజలు ఇబ్బందూలకు గురవుతున్నరని ముధోల్ నియోజకవర్గం శాసనసభ్యులు రామారావు పటేల్ దృష్టికి తీసేకెళ్లిన గ్రామ సర్పంచ్ జక్కుల గజేంధర్, సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే 66,లక్షల నిధులు మంజూరు చేశారు,ఈ కారిక్రమంలో సీనియర్ నాయకులు వెంగల్ రావు తదితరులు పాల్గొన్నారు

# యోగతో మానసిక ప్రశాంతత

**సర్పంచ్, జక్కుల గజేందర్ :-**

**పంచాయతీ కార్యదర్శి రాజబాపు:-**



**కుంటాల జూన్ 21 (ప్రజాజ్యోతి)** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజాబాపు, కుంటాల సర్పంచ్ జక్కుల గజేందర్ ఆధ్వర్యంలో,యోగా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించరు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యోగా ద్వారా ఆరోగ్యం, మానసిక ప్రశాంతత, జీవనశైలిలో క్రమశిక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు.  భారతీయ సంస్కృతి సాంప్రదాయాల లో ప్రాచీనమైన యోగాసనాల ద్వారా మానసిక ప్రశాంతత తో పాటు సంపూర్ణ ఆరోగ్యం ప్రాప్తిస్తుందని అన్నారు. భారత ప్రధాని అంతర్జాతీయ యోగా దినోత్సవం అమలు చేస్తూ యోగాసనాల ప్రాముఖ్యతను చాటి చెబుతున్నారని అన్నారు. విద్యార్థి దశ నుండి యోగాసనాలు అభ్యసించి సన్మార్గంలో ఉన్నత విలువలను పెంపొందించు కోవాలని సూచించారు.

# ప్రతి ఒక్కరూ యోగాను నిత్య జీవనశైలిలో భాగం చేసుకోవాలి

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

**ఆదిలాబాద్ జిల్లాలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు**

**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 21, (ప్రజా జ్యోతి)** ప్రతి ఒక్కరూ యోగాను నిత్య జీవనశైలిలో భాగం చేసుకోవా లని జిల్లా కలెక్టర్ రాజర్షి షా పి లుపునిచ్చారు. ఆదివారం స్థా నిక రెవిన్యూ గార్డెన్ లో అంత ర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్, స్థానిక శాసనసభ్యులు పాయల్ శంక ర్, మున్సిపల్ చైర్ పర్సన్ బం డారి అనూష లతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అతిథులు, అధికారులు, విద్యార్థులు, యువత, ప్రజా ప్రతినిధులు, వివిధ వర్గాల ప్రజలతో శిక్షకులు యోగా ఆసనాలు వేయించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మన దేశంలో జన్మించిన యోగా నేడు ప్రపంచవ్యాప్తంగా అందరికీ స్ఫూర్తి దాయకంగా నిలిచిందన్నారు. ప్రతి ఒక్కరూ నిత్యం అరగంట నుండి గంట పాటు యోగాను అలవాటు చేసుకోవడం ద్వారా మానసిక ఒత్తిడి, ఆధు నిక జీవనశైలి వ్యాధుల నుండి దూరం కావచ్చుని, అలాగే జీవిత కాలాన్ని పెంచుకోవచ్చు ని పిలుపునిచ్చారు. ముఖ్యంగా గర్భిణీ స్త్రీలకు యోగా వల్ల నార్మల్ డెలివరీ అయ్యే అవకాశాలు పెరుగుతాయని, పుట్టే పిల్లలు కూడా ఆరోగ్యంగా ఉంటారని, ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో యోగా శిక్ష కుల ద్వారా శిక్షణ అందించా మన్నారు. అలాగే జూన్ 26 అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించు కుని జిల్లాలో నిర్వహిస్తున్న "నషా ముక్త్ భారత్ సప్తాహ్" కార్యక్రమాలలో భాగంగా వ్యసనాల నుండి విముక్తి  పొందడానికి కూడా యోగా ఎంతో దోహద పడుతుందని వివరించారు. గత 12 రోజులుగా జిల్లాలోని వివిధ పాఠశాలలు, గ్రామాల్లో ప్రజలకు యోగా నేర్పించిన శిక్షకులకు, ప్రత్యేక ధన్యవాదాలు తెలి యజేశారు. ఎంపీ గోడం నగేష్ మాట్లాడుతూ, భారతదేశంలో వేల ఏళ్ల నాటి చరిత్ర కలిగిన యోగా




కేవలం శారీరక, మానసిక ఉల్లా సానికే కాకుండా ఆధ్యాత్మిక జీవనానికి కూడా ఎంతో దోహదప డుతుందని, దీని విశిష్టతను గుర్తించే ఐక్య రాజ్యసమితి కూడా యోగాకు అంతర్జాతీయ గుర్తింపు నిచ్చిందని తెలిపారు. ప్రపంచ మంతా ఆరోగ్యంగా ఉండాల నేదే ప్రధానమంత్రి ఆశయమని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం కోసమే యోగాను విస్తృతంగా ప్రచారంలోకి తెచ్చారని కొనియాడారు. ప్రస్తుత రోజుల్లో చిన్నపాటి అనారోగ్యం వచ్చినా వైద్యానికి ఎంతో ఖర్చవుతోందని, నిత్యం ఒక అరగంట నుండి గంట సమయం యోగాకు కేటాయిస్తే శారీరక ఆరోగ్యంతో పాటు ఆర్థిక ఇబ్బందులు కూడా తప్పుతా యని సూచించారు. ఉదయా న్నే లేవగానే సోషల్ మీడియాలో రీల్స్ చూస్తూ సమయాన్ని వృథా చేయడానికి బదులుగా, మొబైల్‌లో యోగా యాప్ లను డౌన్‌లోడ్ చేసుకుని ప్రతి ఒక్కరూ నిత్యం యోగా సాధన చేయాలని, ఆరోగ్య సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ, జిల్లా ప్రజలందరికీ యోగా దినోత్సవ శుభా కాంక్షలు తెలియజేశారు. భారతీయ యోగాను ప్రపంచ వ్యాప్తం చేయడానికి ప్రధాని తీసుకున్న చొరవ వల్లనే ఈ రోజు 140 కి పైగా దేశాల్లో యోగా వేడుకలు జరుగుతు న్నాయని కొనియాడారు. ప్రస్తుత సమాజంలో విద్యార్థుల నుండి పెద్దల వరకు ఎదుర్కొంటున్న మానసిక ఒత్తిడికి యోగా ఒక్కటే సరైన పరిష్కా రమని ఎమ్మెల్యే స్పష్టం చేశా రు. ఒత్తిడి తట్టుకోలేక చాలా



మంది ఆత్మహత్యలకు పాల్ప డుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ, నిత్యం యోగా సాధన చేసే వారికి ఎలాంటి కష్టాల నైనా ఎదుర్కొనే మానసిక ధైర్యం లభిస్తుందని అంతర్జాతీయ పరిశోధనలు చెబుతున్నాయన్నారు. ఫోన్లలో రకరకాల అప్లికేషన్లు చూసే మనం, యోగాను కూడా జీవితంలో ఒక భాగం చేసుకోవాలని, ప్రతి రోజూ 20 నుండి 30 నిమిషాలు యోగా చేస్తూ ఆరోగ్యాన్ని కా పా డుకోవాలని ప్రజలకు సూచించారు. మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష మాట్లా డుతూ, ప్రస్తుత జీవన విధానంలో యోగా సైతం భాగం చేయాలని, ప్రజలందరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించి, యో గా చేయాలని సూచించారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమా రీస్ కు సంబంధించిన యోగా పోస్టర్ ను ఆవిష్కరించి, యోగ శిక్షకులను అతిథులు ఘనంగా శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, డియంహెచ్వో సాధన, డిపిఆర్ఓ విష్ణువర్ధన్, డివై ఎ స్ ఓ దయానంద్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, డి ఈ ఓ మాధవి, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, ఆయుష్ వై ద్యులు చంద్ర శేఖర్, ప్రీతి, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, ప్రజాప్రతినిధులు, యువత, విద్యార్థులు, ఆశా వర్కర్లు, సీనియర్ సిటిజన్లు, వివిధ వర్గాల ప్రజలు, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రోల్ మామడలో ఘనంగా యోగా దినోత్సవం



**నేరడిగొండ జూన్ 21 ( ప్రజా జ్యోతి ) :** మండలంలోని రోల్ మామడ గ్రామంలో ఏకల్ పాఠశాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు యోగా సాధనతో దైనందిన జీవితంలో ఆందోళనలు తగ్గిపోయి మానసిక ప్రశాంతత ఏకాగ్రత మెరుగుపడతాయని అంచల్ కార్యాలయ ప్రముఖ్ ఉడుగుల అభిలాష్ అన్నారు. అనంతరం మాట్లాడుతూ నిత్యం సాధన చేయడం ద్వారా మనసును ప్రశాంతంగా ఉంచి ఆందోళన భయాలను దూరం చేస్తుందని తెలిపారు. ఏకాగ్రత పెరిగి మెదడు చురుకుగా పనిచేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంచల్ బోథ్ ప్రసిక్షక్ ఆత్రం గంగామణి, మాతాజీ శశికళ పాల్గొన్నారు.

## నూతన ఎస్సైకి ఘన సన్మానం

ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటా: ఎస్సై సుధాకర్

కాంగ్రెస్ నేతల శుభాకాంక్షలు



**ఆసిఫాబాద్ జూన్ 21 ప్రజా జ్యోతి** కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరిపోలీస్ స్టేషన్‌కు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సై సుధాకర్‌ను స్థానిక కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆత్రం కుసుంరావు, కాంగ్రెస్ నాయకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఎస్సై కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు తమ వంతు సహకారం అందిస్తామని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. నూతన ఎస్సై సుధాకర్ మాట్లాడుతూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, ప్రజల సమస్యలు, ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. మండల ప్రజలు చట్టాలను గౌరవించి పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆత్రం లింభారావు, జల్పతి, కుంరం భగవంతరావు, బాబు నాయక్, కుదుందిన్, చటరే శంకర్, ఆత్రం ముకుందరావు, గుండి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్జీయూకేటీ బాసరలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు



**బాసర జూన్ 21 (ప్రజా జ్యోతి)**రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్జీయూకేటీ) బాసర క్యాంపస్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఆదివారం అత్యంత ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు హాజరయ్యారు. డిపార్ట్మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ మొత్తం కార్యక్రమాన్ని ఫ్యాకల్టీ ఇంచార్జ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ యం.రామకృష్ణ, ఫిజికల్ డైరెక్టర్ డి శ్యాంబాబు సమర్థవంతంగా పర్యవేక్షించారు. ఈ వేడుకల్లో భాగంగా డిపార్ట్మెంట్ ఆఫ్ సైకాలజీ కౌన్సిలర్ నాగలక్ష్మి ప్రత్యేక యోగా క్లాసులు నిర్వహించారు. యోగాసనాలు, మెడిటేషన్, ప్రాణాయామం ప్రాధాన్యతను వివరిస్తూ మానసిక ఉల్లాసానికి యోగా ఏవిధంగా తోడ్పడుతుందో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో క్యాంపస్ విద్యార్థులు, బోధన సిబ్బంది, బోధనేతర సిబ్బంది, వివిధ అధికారులు పాల్గొని ఉత్సాహంగా యోగాసనాలు వేశారు.

# వడ్డీ పేరుతో ప్రజల నడ్డి విరుస్తున్న అక్రమ వడ్డీ వ్యాపారుల అరెస్ట్

ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన బాధితుల నుంచి అధిక వడ్డీలు వసూలు చేస్తూ వేధింపులు

నిందితుల ఇంటి నుండి భారీ మొత్తంలో ప్రామిసరీ నోట్లు,చె క్కులు, బాండ్ పత్రాలు స్వాధీనం

రెండు కోట్ల విలువైన 90 ప్రా మిసరీ నోట్లు,26 కాళీ ప్రామి సరీ నోట్లు, 366 చెక్కులు స్వాధీనం

అక్రమ వడ్డీ వ్యాపారులపై కఠిన చర్యలు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 21, (ప్రజా జ్యోతి)** ప్రజల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకొని అధిక వడ్డీలు వసూలు చేస్తూ, బెదిరిం పులు, కుల దూషణలకు పా ల్పడుతున్న అక్రమ వడ్డీ వ్యా పారులపై జిల్లా పోలీసు శాఖ ఉక్కుపాదం మోపిందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎ స్ తెలిపారు. ఈ మేరకు ఇచ్చోడ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో ఇద్దరు నిందితులను (తండ్రి కొడుకులను) అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ పత్రికా సమావే శంలో వెల్లడించారు. వివరాల్లోకి వెళితే, ఇచ్చోడకు చెందిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఆర్థిక అవసరాల నిమిత్తం నిందితుడు అర్రోల్ల వెంకట ర మణ వద్ద రూ.2 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. అప్పు ఇచ్చే సమయంలో బాండ్ పేపర్లు, చెక్కులు, ప్రామిసరీ నోట్లు తీసుకున్న నిందితుడు, బాధితుడు అప్పు మొత్తాన్ని చెల్లించినప్పటికీ అదనంగా భారీ మొత్తంలో వడ్డీ డిమాండ్ చేస్తూ బెదిరింపులకు పాల్పడ్డాడు. తన వద్ద ఉన్న చెక్కులు, ప్రామిసరీ నోట్లు దుర్వినియోగం చేస్తానని, పరువు తీస్తానని బెదిరిస్తూ అదనంగా రూ.2 లక్షలు వసూలు చేసినట్లు విచారణలో తేలింది.నిందితులు బాధితుడిని కులం పేరుతో దూషిస్తూ అవమాన కర వ్యాఖ్యలు చేసి మానసికంగా వేధించి నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇదే విధంగా మరికొంతమంది ఎస్టీ వర్గాలకు చెందిన వ్యక్తుల వద్ద కూడా అధిక వడ్డీలు వసూలు చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది.

**అరెస్ట్ అయిన నిందితులు**

ఎ1. అర్రోల్ల వెంకటరమణ, తండ్రిలస్మన్న, వయస్సు 56 సంవత్సరాలు, స్వగ్రామం కుమారి గ్రామం, ఇచ్చోడ మండలం, ప్రస్తుతం హనుమాన్ నగర్, ఇచ్చోడ నివాసి.ఎ 2. అర్రోల్ల ఉపేందర్, తండ్రి వెంకటర మణ, వయస్సు 33 సంవ త్సరాలు, స్వగ్రామం కుమారి



గ్రామం, ఇచ్చోడ మండలం, ప్రస్తుతం హనుమాన్ నగర్, ఇచ్చోడ నివాసి. నిందితుల ఇంటి నుండి ప్రామిసరీ నోట్లు 90 ఖాళీ బాండ్ పేపర్లు --26, చెక్కులు 366, పట్టాదార్ పాస్ పుస్తకాలు -- 7, ఆధార్ కార్డులు -- 6 బ్యాంక్ పాస్ పు స్తకాలు -- 4,పాన్ కార్డు 1,నిందితులు పలువురు వ్యక్తుల నుండి అప్పులకు సంబంధించిన పత్రాలను తమ వద్ద ఉంచుకొని అక్రమ వడ్డీ వ్యాపారం నిర్వహిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు పై డాక్యు మెంట్లను స్వాధీనం చేసుకున్నారు.ప్రజలు అక్రమ వడ్డీ వ్యాపారుల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా అధిక వడ్డీలు వసూలు చేస్తూ వేధింపులకు పాల్ప డితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ సూచించారు. వీరి ద్వారా బాధింపబడిన ఎవరైనా నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని సూచించారు. వడ్డీ వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు ప్రజలు అధిక వడ్డీలపై ఎలాంటి సమస్యలున్న సంబంధిత పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని పోలీసు యంత్రాంగం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి, సిసిఎస్ ఇన్స్పెక్టర్ చంద్ర శేఖర్, ఇచ్చోడ ఇన్స్పెక్టర్ కె నరేష్ కుమార్, సిసిఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మద్యం తాగించి యువకుడి దారుణ హత్య

-ప్రేమ వ్యవహారమే కారణం: నిందితుల అరెస్ట్, రిమాండ్

-కేసును ఛేదించిన ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక్ సాయి కొట్టే ఐపీఎస్

**నేరడిగొండ, జూన్ 21 (ప్రజాజ్యోతి):**మండలంలోని పెద్దబుగ్గారం గ్రామానికి చెందిన నాతరి సతీష్ (23, ఎస్సీ సామాజిక వర్గం) అనే యువకుడిని పథకం ప్రకారం మద్యం తాగించి, గొంతు నులిమి దారుణంగా హత్య చేసిన ఘటన కలకలం రేపింది. ఈ కేసులో పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి 48 గంటల్లోనే నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు వివరాలను ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక్ సాయి కొట్టే ఐపీఎస్, నేరడిగొండ ఎస్సై ఇమ్రాన్ ఖాన్లతో కలిసి మీడియాకు వెల్లడించారు.

**మిస్సింగ్ కేసు నుండి హత్య కేసు వరకు..**

జూన్ 17న నాతరి సతీష్ కనిపించకుండా పోవడంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నేరడిగొండ పోలీస్ స్టేషన్‌లో మొదట మిస్సింగ్ కేసు నమోదైంది. అయితే, జూన్ 19న కరాత్‌వాడ చెరువులో సతీష్ మృతదేహం లభ్యమవడంతో పోలీసులు దీనిని హత్య కేసుగా మార్చి దర్యాప్తు ప్రారంభించారు. సాంకేతిక ఆధారాలు, సీసీటీవీ ఫుటేజీలు, ప్రత్యేక బృందాల సహాయంతో దర్యాప్తును వేగవంతం చేసి నిందితులను పట్టుకున్నారు.

**హత్యకు కారణం: 'ప్రేమ' వ్యవహారమే!**

పోలీసుల విచారణలో షాకింగ్ నిజాలు వెలుగులోకి వచ్చాయి. ప్రధాన నిందితుడైన షేక్ సుమేర్ ( ఏ 1) తన ప్రేమ వ్యవహారానికి సతీష్ అడ్డు వస్తున్నాడనే కక్షను పెంచుకున్నాడు. సతీష్‌ను ఎలాగైనా వదిలించుకోవాలని తన స్నేహితులతో కలిసి స్కెచ్ వేశాడు. జూన్ 17న మద్యం పార్టీ పేరుతో సతీష్‌ను కరాత్‌వాడ చెరువు వద్దకు పిలిపించారు. అక్కడ అతడితో బలవంతంగా ఎక్కువ మొత్తంలో మద్యం తాగించారు. అనంతరం సతీష్ స్పృహ కోల్పోయే స్థితికి రాగానే గొంతు నులిమి దారుణంగా హత్య చేశారు.

**సాక్ష్యాల గుర్తింపు.. వస్తువుల స్వాధీనం:**



హత్య అనంతరం నిందితులు సతీష్ శవాన్ని చెరువులో పడేశారు. సాక్ష్యాలను నాశనం చేసేందుకు మృతుడి బైక్‌ను ఆదిలాబాద్‌కు తరలించగా, అతడి మొబైల్ ఫోన్‌ను నడుస్తున్న రైలులో పడేశారు. నిందితుల నుంచి: 5 మొబైల్ ఫోన్లు నేరానికి ఉపయోగించిన 2 ద్విచక్ర వాహనాలు మృతుడి ద్విచక్ర వాహనం ఘటనా స్థలంలో లభించిన 7 ఖాళీ బీరు సీసాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు:మృతుడు ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి అని తెలిసి కూడా ఈ నేరానికి పాల్పడి నందున, నిందితులపై 'భారతీయ న్యాయ సంహిత' ( బి ఎన్ ఎస్ ) సెక్షన్లతో పాటు ఎస్సీ/ఎస్టీ దౌర్జన్యాల నిరోధక చట్టం సెక్షన్ 3(2)(ఐ) కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్పీ తెలిపారు. అరెస్ట్ అయిన నిందితుల వివరాలు: 1. ఏ 1) షేక్ సుమేర్ (24) -- తండ్రి: షేక్ మక్బూల్ (కుమారి గ్రామం, ప్రస్తుతం బోథ్ నివాసి) -- ప్రధాన నిందితుడు 2. ఏ 2) గంగాధరి సాయి కృష్ణ (23) -- తండ్రి: గంగన్న (నేరడిగొండ) 3. ఏ 3) బొజ్జ విష్ణువర్ధన్ (22)ఏ -- తండ్రి: స్వామి (కుప్టీ గ్రామం, నేరడిగొండ) 4. ఏ 4) షేక్ అక్రమ్ (22) -- తండ్రి: షేక్ సాబ్ (ఇస్లాంపురా కాలనీ, బోథ్) 5. ఏ 5) అబ్దుల్ నెహాఫ్ (19)ఏ -- తండ్రి: అబ్దుల్ నయీమ్ (సాయినగర్ కాలనీ, బోథ్) 6. ఏ 6) సయ్యద్ నోమాన్ (19) -- తండ్రి: సయ్యద్ సజీద్ (సాయినగర్ కాలనీ, బోథ్)

# జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు

ముందస్తు అనుమతులు లే కుండా ప్రజా బహిరంగ కార్యక్రమాలు, సభలు, ర్యాలీలు నిషేధం

నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

బైకులు, కార్లు, బస్సుల పేరు పై అనుమతులు లేకుండా యాత్రలను చేయరాదు



**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 21, (ప్రజా జ్యోతి)** శాంతి భద్రతల పరిరక్షణ దృ ష్ట్యా, జిల్లాలో ఎలాంటి అసాం ఘిక కార్యక్రమాలు, అవాంఛ నీయ సంఘటనలు చోటు చేసుకోకుండా, ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా, జిల్లాలో ఉన్న ప్రశాంత వాతావరణం భంగం కాకుండా, సవ్యంగా కొ నసాగించడానికి జిల్లా వ్యా ప్తంగా 30 పోలీస్ ఆక్ట్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలియజేశారు. ఈ సందర్భంగా 30 పోలీ స్ ఆక్ట్ -1861 అమల్లో ఉ న్నందున జిల్లాలో డి ఎస్పి లేదా ఆపై స్థాయి అధికారుల నుండి ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి ప్రజా సమా వేశాలు, ఊరేగింపులు, ధర్నాలు, బహిరంగ సభలు, ప్రజలు గుమి గుడి ఉండే విధంగా కార్యక్రమాలు నిర్వ హించరాదని, సన్నాహాలు చేయరాదని తెలిపారు. నిషేధిత ఆయుధా లు, కత్తులు, కర్రలు, దుడ్డ కర్రలు, తుపాకులు, పేలుడు పదార్థాలు, దురుద్దేశంతో నేరా లను ఉసి గొలిపేటువంటి ఆ యుధాలు కలిగి ఉండరాదని తెలిపారు. ప్రజా జీవనానికి ఇ బ్బంది దారి తీసే ప్రజా సమా వేశాలు, జన సమూహం లాంటివి పూర్తిగా నిషేధించబడ్డా యని తెలిపారు. అధిక శబ్దం వచ్చే స్పీకర్లు, డీజేలు వంటివి వాటికి అనుమతులు లేవని తెలిపారు. ప్రచార రథాలు, మైకులు, తదితర అధిక శబ్దం పరికరాలు నిషేధించబడ్డాయని సూచించారు. బైకులు, కార్లు, బస్సులు పేరుపై యాత్రలను అనుమతులు లేకుండా చేయవద్దని తెలిపారు. చట్ట ప్రకారం జారీ చేసిన ఆదేశాలను ఎవరైనా ఉల్లం ఘిస్తే 30 పోలీస్ ఆక్ట్ ప్రకారం శిక్షార్హులవు తారని సూచించారు. నిషేధంలో ఉన్న నిబంధనలను తప్ప నిసరిగా ప్రతి ఒక్కరు పాటిం చాలని తెలిపారు. నిబంధనలను అతిక్రమించి ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు.

## ఖిరిడి గ్రామ ప్రజల చిరకాల కల సాకారం

**రూ.50 లక్షలతో సీసీ రోడ్డుకు ఎమ్మెల్యే కోవ లక్ష్మి శంకుస్థాపన**

**మారుమూల గ్రామాలకు రోడ్డు కనెక్టివిటీయే లక్ష్యం: ఎమ్మెల్యే**



**ఆసిఫాబాద్ జూన్ 21 ప్రజా జ్యోతి** ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం కిర్డీ గ్రామ ప్రజల చిరకాల వాంఛ నెరవేరింది. గ్రామంలో రూ.50 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రోడ్డు సౌకర్యం లేక కిర్డీ గ్రామ ప్రజలు చాలా సంవత్సరాలుగా ఇబ్బందులు పడుతున్నారని, ఎన్నికల సమయంలో తన దృష్టికి తీసుకురాగా ఇచ్చిన మాట ప్రకారం నేడు శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉందన్నారు. గ్రామ ప్రధాన రహదారి నుంచి గ్రామం లోపలికి సీసీ రోడ్డు నిర్మిస్తామని, పనులను నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ రోడ్డు నిర్మాణంతో గ్రామస్తుల రాకపోకల సమస్య శాశ్వతంగా తీరుతుందని తెలిపారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలోని ప్రతి మారుమూల గ్రామానికి రోడ్డు కనెక్టివిటీ కల్పించడమే లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాంకిడి మండల ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ మండల నాయకులు, కార్యకర్తలు, మలి సంఘం నాయకులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## అదిలాబాదులో ప్రశాంతంగా నీట్ పరీక్ష

**ఒక వంద 80 మంది గైర్హాజరు**

**పరీక్షలను పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ**



**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 21, (ప్రజా జ్యోతి)** అదిలాబాద్ జిల్లా కేంద్రంలో నీట్ పరీక్ష లు ప్రశాంతంగా జరిగాయి. ఆదివారం పట్టణంలోని నీట్ పరీక్ష కేంద్రాలను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తొ కలిసి జిల్లా కలెక్టర్ రాజర్షిషా పరిశీలించి అభ్యర్థుల హా జరు వివరాలను తీసుకొని ఏర్పాట్లపై అధికారులను పలు సూచనలు చేశారు. నీట్ పరీక్షకు మొత్తం 1,763 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా, వారిలో 1,583 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. అలాగే 180 మంది విద్యార్థులు గైర్హాజర య్యారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించినట్లు కలె క్టర్ తెలిపారు. ఈ పరీక్ష లకు ఏర్పాట్లలో అదనపు ఎస్పీ సురేందర్, ఆర్డీఓ జగదీశ్వర్ రావు, ఇతర అధికారులు, సిబ్బంది, అభ్యర్థులు, తదితరులు పాల్గొని పర్యవేక్షించారు.

# పట్టణరోడ్డు విస్తరణ పనులపై రోడ్లపై వెలసిన ఫ్లెక్సీలు

## మేమేం పాపం చేశాం? ఈ రోడ్డు దుస్థితి దౌర్భాగ్యం ఎప్పుడు పోతుంది

## కట్టే పన్నులు ఈ రోడ్లకు సంబంధం లేదా? అంటూ కామెంట్స్.

**ఖానాపూర్ జూన్ 21 (ప్రజా జ్యోతి )** నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణ రోడ్డు విస్తరణ పై వెలసిన ఫ్లెక్సీలు మేమేం పాపం చేశాం ఈ రోడ్డు దౌర్భాగ్యం ఎప్పుడు పోతుంది? మేము కట్టే ఇంటి వ్యాపార తదితర పనులు ఈ రోడ్డు అభివృద్ధికి సంబంధంలేదా అధికారులు ప్రజా ప్రతినిధులు పట్టించుకోరా? అంటూ పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు రోడ్డు విస్తరణ పేరుతో భవనాల కూల్చివేతలు చేపట్టినప్పటికీ, పనులు ముందుకు సాగకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ప్రధాన రహదారుల వెంట రోడ్డు విస్తరణ కోసం పలుచోట్ల నిర్మాణాలను తొలగించినప్పటికీ, పూర్తి స్థాయిలో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టకపోవడంతో దుమ్ము, ధూళి, గుంతలతో వాహన చోదకులు పాదాచారులు బస్సుల్లో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు రోడ్డు వెడల్పు కోసం కూల్చడం మీ పని అయితే, రోడ్డు విస్తరణ పూర్తి చేయడం ఎవరి పని? అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.వ్యాపారులు, వాహనదారులు, పాదచారులు నిత్యం ఇబ్బందులు పడుతున్నప్పటికీ సంబంధిత శాఖలు స్పందించడం లేదని విమర్శిస్తున్నారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రోడ్డు విస్తరణకు నిధులు కేటాయించిన సరైన సమయంలో పనులు పూర్తి చేయకపోవడం వల్ల విస్తరణ కోసం భవనాల తొలగింపు కొందరు కోర్టుకు వెళ్లి ఆపిన సందర్భంలో పనులు నిలచిపోయాయి. అప్పటికే ఎన్నికలు రావడం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం చకాచకా సమయం సంవత్సరం నర గడిచిపోయింది గత సంవత్సరం కోర్టుకెళ్లిన గృహస్తులను వ్యాపారులను సంజాయించి రోడ్డు విస్తరణ పనులు విస్తరిస్తాం అన్న ఆశలు ఎమ్మెల్యే తో చిగురించి సంవత్సరం గడుస్తున్నా రోడ్డు విస్తరణ పనుల్లో ఆశించిన పురోగతి కనిపించడం లేదని, ప్రజల ఆరోపిస్తున్నారు ఈ నేపథ్యంలో పట్టణంలోని పలుచోట్ల ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి. మేమేం పాపం చేశాం ?ఈ రోడ్డు దౌర్భాగ్యం ఎప్పుడు పోతుంది ? రోడ్డు విస్తరణ పనులు వెంటనే పూర్తి చేయాలి,మన రోడ్డు మన హక్కు వంటి నినాదాలతో ఏర్పాటు



చేసిన ఫ్లెక్సీలు ప్రజల దృష్టిని మళ్లిస్తూ వాస్తవానికి పాపం ఎవరిది పనులు సరైన సమయంలో పూర్తి చేయకపోవడం గడచిన బిఆర్ఎస్ ప్రభుత్వానిదా? అనంతరం వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానిదా? ప్రస్తుతం పట్టణంలో పురపాలక సంఘ పాలకులదా గడచిన మున్సిపల్ ఎన్నికల్లో తమకు అధికారం ఇస్తే కేంద్ర ప్రభుత్వ నిధులతో రోడ్డు వెడల్పు తో పాటు పట్టణాన్ని సుందరీకరణ చేస్తామని పార్లమెంటు సభ్యులు,రాష్ట్ర బిజెపి రథసారథి చైర్ పర్సన్ ప్రమానా స్వీకారంలో హామీ ఇచ్చిన బిజెపిదా? లేక పార్టీలకతీతంగా 12 మంది ప్రాతినిధ్యం వహిస్తున్న కౌన్సిలర్లదా? అర్థం కాని పరిస్థితుల్లో పట్టణ ప్రజలుఉన్నారు ఈ రీతిగా ఫ్లెక్సీలు పార్టీల కతి తంగా ఏర్పాటు చేశామనీ నేడు సోమవారం సమావేశం ఏర్పాటు చేసి రోడ్డు విస్తరణ పై చర్చిస్తు న్నట్లు కొందరు పౌరులు ప్రకటిస్తున్నారు రానున్న రోజుల్లోఉద్యమం ఏ మేరకు చేరనుంది రోడ్డు వెడల్పు జరిగే వరకు పార్టీల కతి తంగా పోరాడనున్నారా? ఇందులో పార్టీలు, పార్టీకి సంబంధించిన వ్యక్తులు మిళితమై రాజకీయం చేసి పట్టణ అభివృద్ధిని కాంక్షిస్తున్నారా, విస్మ నించనున్నారా కడవరకు ఉద్యమం కొనసాగించనున్నారా వేచి చూడాల్సిందే నని పరిశీలకులు భావిస్తున్నారు. ఏది ఏమైనా పట్టణ రోడ్డు పనులు జరిపించి ప్రజల అవస్థలు తీర్చాలన్నది నగ్న సత్యం అని వ్యాఖ్యానిస్తున్నది మాత్రం కచ్చితంగా పచ్చినిజం.

## పోలీసుల ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు

**300 మంది పోలీసు సిబ్బందితో హెడ్ క్వార్టర్స్‌లో సామూహిక యోగా నిర్వహణ**

**యోగా ద్వారా మానసిక, శారీరక ప్రశాంతత లభిస్తుంది**

**ఆసనాలు, ప్రాణాయామం, సూర్య నమస్కారాలు యోగాలో ప్రధానమైనవి**

**12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన జిల్లా ఎస్పీ**

**యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి యోగా, క్రీడలను అలవాటు చేసుకోవాలి**





**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 21, (ప్రజా జ్యోతి)**12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆది వారం ఆదిలాబాద్ పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో నిర్వహించిన యోగా కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ పాల్గొని పోలీసు సిబ్బందితో కలిసి యోగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాదాపు 300 మంది పోలీసు అధికారులు, సిబ్బంది సామూహికంగా పాల్గొని యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప సంపదల్లో యోగా ఒకటని, యోగా ద్వారా మానసిక ప్ర శాంతతతో పాటు శారీరక ఆ రోగ్యం కూడా మెరుగుపడుతుందని తెలిపారు. నేటి యువత చెడు వ్యసనాలు, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండి యోగా, వ్యాయా మం, క్రీడలను దైనందిన జీవితంలో భాగంగా చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. అనంతరం యోగా అధ్యాపకుల ఆధ్వ ర్యంలో ఆసనాలు, ప్రాణాయామం, సూర్య నమస్కారాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సిబ్బందికి 12 వ అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి. సురేందర్ రావు, డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, రిజర్వ్ సిబ్బంది, యోగా అధ్యాపకులు పోలీసు ఏఎస్ఐ రమేష్, కానిస్టేబుల్ రాజు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఆయుష్ విభాగం ఆధ్వర్యములో సోనాలలో యోగ దివాస్



**సోనాల, జూన్ 21 ( ప్రజాజ్యోతి ):**సోనాల మండలకేంద్రంలో యోగా దినోత్సవం సందర్భంగా యోగ ఇన్స్ట్రక్టర్ మునిగెల యోగిత ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని వివేకానంద పాఠశాలలో ఉదయం యోగాసనాలు ప్రాణయామము, విద్యార్థులచే వివిధ రకాల ఆసనాలను వేయించడం జరిగింది. ఆరోగ్యమే మహాభాగ్యం అనే మాటకు యోగ ఒక ఉత్తమ మార్గం, ప్రతిరోజూ కొద్దిసేపు యోగాభ్యాసం చేయడం ద్వారా శారీరక,మానసిక మరియు ఆధ్యాత్మిక ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవచ్చు అని అందువల్ల యోగ ప్రతి వ్యక్తి జీవితంలో ముఖ్యమైన స్థానాన్ని కలిగి ఉంటుందని యోగిత తెలిపారు.కార్యక్రమంలో గ్రామంలోని పెద్దలు, యువకులు, పిల్లలు, మహిళలు పాల్గొన్నారు.

# సామాన్య కుటుంబం నుండి అసమాన స్థాయికి

## పేదింటి న్యాయవాది సేవలకి డాక్టరేట్ అవార్డు



**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 21, (ప్రజా జ్యోతి)** ఆయనో న్యాయవాది. పుట్టింది ఒక మామూలు మధ్య తరగతి కుటుంబం. అమ్మా నాన్నలు నిరక్షరాస్యులు, మాతృమూర్తి స్వర్గీయ గిర్మబాయ్ తదనంతరం సంగెంచారిట బుల్ ట్రస్ట్ నెలకొల్పి వివిధ సేవా కార్యమాలు చేపట్టి ప్రజల్లో మన్ననలు పెందుతున్నారు. వారి సేవలకు ఎన్నో అవార్డులు, వారి సేవలకు గాను ఈ పిబి యూనివర్సిటీ వెల్లింగ్టన్ సౌతాఫ్రికా వారు, ఆర్ట్ ఆఫ్ లి వింగ్, వందన యూత్ వాలం టీర్ ఆర్గ నైజషన్ సంయుక్తంగా "గౌరవ డాక్టరేట్ ' డిగ్రీతో సన్మానం చేశారు. ఆదివారం హైదరాబాద్ లోని తెలంగాణా సార్వత్రిక పరిషత్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖసి నీ నిర్మాత రేలంగి నరసింహారావు, ప్రముఖ సినీ నిర్మాత ఆకుల రమేష్, వందన యూత్ ఆర్గనైజషన్ అధ్యక్షులు పులి ప్రసాద్, జనార్దన్, అభి నందన, శుభాష్ గుప్తా తది తరులు పాల్గొన్నారు. ఒక సామాన్య మధ్యతరగతి కు టుంభం నుండి అస మాన్య స్థాయికి ఎదుగుతూ డాక్టర్ సుధీర్ కుమార్ సంగెం ఆది వారం డాక్టర్ డిగ్రీ పొందడం పట్ల జిల్లా ప్రజలు, తోటి న్యాయవాదులు, ఆయన స్వగ్రామం అయిన ఇచ్చోడ మండలం, ఆడేగాం (కె) గ్రామ ప్రజలు ఆనందం హర్షం వ్యక్త పరుస్తున్నారు. ఈ డాక్టరేట్ డిగ్రీ తో మరింత బాధ్యత పెరిగిందని న్యాయవాది సుధీర్ కుమార్ సంగెం పేర్కొన్నారు.

# మత్తు ఇంజక్షన్స్ ఇచ్చి ఆవులు, ఎడ్లను కార్లలో దొంగలించి మహారాష్ట్ర వధ శాలలలో విక్రయిస్తున్న అంతర్రాష్ట్ర ఘ రానా దొంగల ముఠా అరెస్ట్

**13 మంది నిందితులపై కేసు నమోదు, ఐదుగురు అరెస్ట్ మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ రా ష్ట్రాలకు చెందిన నిందితుల ప్రమేయం కేసును చేదించడానికి ప్రత్యేక బృందాలు ఏర్పాటు ఒక కారు, 5 సెల్ ఫోన్స్, ఫేక్ నెంబర్ ప్లేట్స్ స్వాధీనం పత్రికా సమావేశంలో వివరాలను వెల్లడించిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**







**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 21, (ప్రజా జ్యోతి)** మత్తు ఇంజక్షన్ ఇచ్చి ఆవులు ఎడ్లను కార్లలో దొంగలించి మ హారాష్ట్ర వధశాలలో విక్రయి స్తున్న అంతరాష్ట్ర ఘరానా దొంగల ముఠాను పట్టుకుని 13 మంది నిందితులపై కేసు నమోదు చేసి ఐదుగురిని అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ వెల్లడించారు. మొహమ్మద్ షాహిద్ హబీబ్ ఖాద్రి (31) హబీబ్ ఖాద్రి, అన్వర్ అపార్ట్మెంట్, గైబీ నగర్ రోడ్, అన్సార్ నగర్, భివాండి, థానే జిల్లా, మహారాష్ట్ర. (అరెస్ట్) ( 2 కేసులు) ఆలం షేక్ అనీష్ (24) o/శీ షేక్ అనీష్, కళ్యాణి అన్సారి చౌక్, ముంబై, మహారాష్ట్ర. (అరెస్ట్) (5 కేసులు). ఫర్హాన్ సబీర్ షేక్ (27) o/శీ సబీర్ షేక్, రాజీవ్ గాంధీ నగర్, నెహ్రూ నగర్, కుర్లా ఈస్ట్, ముంబై, మహారా ష్ట్ర. (అరెస్ట్) ( 3 కేసులు),షేక్ తబాస్ షకీల్ (21) o/శీ షేక్ షకీల్, జైను సేతు చావల్, రేటీ బందర్ రోడ్, కళ్యాణ్ వెస్ట్, థానే జిల్లా, మహారాష్ట్ర. (అరెస్ట్), వసీం ఖురేషీ (21) o/శీ జలీషా ఖురేషీ, కసాయివాడ, భివాండి, థానే జిల్లా, మహా రాష్ట్ర. (అరెస్ట్), రహీమ్, మీ ర్ పాడ్, ముంబై, మహారాష్ట్ర. (పరారీ),మొండ్ ముర్తుజా ఏ అల్తాఫ్ (29) మొండ్ ముస్తఫా షా, ఆజాద్ ఫరీద్ చావల్, డా. అంబేద్కర్ రోడ్, కళ్యాణ్ వెస్ట్, థానే జిల్లా, మహారాష్ట్ర. (పరారీ), అజీమ్ రౌఫ్ గాజీ ఏ అజ్జు (30) o/శీ రౌఫ్ గాజీ, ఆజాద్ ఫరీద్ చావల్, డా. అంబేద్కర్ రోడ్, కళ్యాణ్ వెస్ట్, థానే జిల్లా, మహారాష్ట్ర. (పరారీ), నబీ బిల్డర్ (పశువధ శాలకు తరలించే వ్యక్తి ) (ప రారీ), తౌకీర్ (పరారీ), పాపు తాండా (పరారీ), బాబు ఏ స య్యద్ సమీర్ (పరారీ) ఖయ్యూమ్ బటారియా ఉత్తరప్రదేశ్ . (పరారీ)లపై కేసు నమోదు చేసినట్లు ఎస్పి వివరించారు.ఆదిలాబాద్ జిల్లా పోలీస్ హెడ్క్వార్టర్స్ సమావేశ మందిరంలో ఆది వారం ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ మాట్లాడుతూ గత ఒకటిన్నర సంవత్సరంగా తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల్లో పశువుల దొంగతనాలకు పాల్పడుతున్న అంతరాష్ట్ర ముఠాను ఆదిలాబాద్ టూటౌన్ పోలీసులు గుర్తించి కేసును ఛేదించినట్లు వెల్లడించారు. ఈ ముఠాకు చెందిన సభ్యులు రాత్రి వేళల్లో ఎస్యూవీ, ఇన్నోవా వాహనాలలో వెనుక సీట్లను తొల గించి, పశువులకు మత్తు మం దులు ఇచ్చి వాటిని వాహనా లలో ఎక్కించి మహారాష్ట్ర రాష్ట్రంలోని నాందేడ్ ప్రాంతంలోని వధశాలల కు తరలించే వారని తెలిపారు. అక్కడ అక్రమంగా మాంసం విక్రయిస్తూ భారీగా లాభాలు పొందుతు న్నట్లు విచారణలో వెల్లడైంద న్నారు. ఈ ముఠాలో మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు ఉన్నారని, వీరు తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాలలో కూడా పశువుల దొంగతనాలకు పాల్పడి నట్లు గుర్తించామని ఎస్పీ తెలిపారు. దేశవ్యాప్తంగా ప్రతిరోజు ఈ ముఠా సభ్యులు పశువుల దొంగతనాలకు పాల్ప డుతూ పెద్ద నేరజాలాన్ని నిర్వ హిస్తున్నట్లు విచారణలో తే లిందన్నారు. నిందితులు త మ వాహనాలకు నకిలీ నంబ ర్ ప్లేట్లు అమర్చుకొని, టోల్ ప్లాజాలు, చెక్పోస్టులు లేని మార్గాలను ఎంచుకొని పశు వులను తరలిస్తూ పోలీసుల కంట పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వెల్లడించా రు. ఈ కేసులో మొత్తం 13 మంది నిందితులపై ఆదిలా బాద్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేయగా, ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు తెలి పారు. మిగతా నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలిం పు చర్యలు కొన సాగిస్తున్నాయని పేర్కొన్నారు. అరెస్ట్ చేసిన నిందితుల వద్ద నుండి ఒక కారు, సెల్ఫోన్లు, నకిలీ నంబర్ ప్లేట్లు స్వాధీనం చేసు కున్నట్లు తెలిపారు. గత ఒక టిన్నర సంవత్సర కాలంలో ఈ ముఠా ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఏడు పశువులదొం గతనాలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైందన్నారు. ఇందులో తలమడుగు పోలీస్ స్టేషన్ పరిధిలో 3 కేసులు, తాంసి పోలీస్ స్టేషన్ పరిధిలో 1 కేసు, జైనథ్ పోలీస్ స్టేషన్ పరిధిలో 1 కేసు, ఆదిలాబాద్ వన్టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 1 కేసు, ఆదిలాబాద్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 1 కేసు నమోదైనట్లు వివరించా రు. నిర్మల్, కామారెడ్డి, జగి త్యాల జిల్లాలలో కూడా ఈ ముఠాపై కేసులు నమోదై ఉన్నాయని తెలిపారు. వివిధ జిల్లాల పోలీసు అధికారులతో సమన్వయం చేసుకుంటూ దర్యాప్తు కొనసాగిస్తున్నామని చెప్పారు. పశువుల దొంగత నాలపై అందిన ఫిర్యాదులను అత్యంత ప్రాధాన్యంగా తీసు కొని ప్రత్యేక బృందాన్ని ఏర్పా టు చేసి సాంకేతిక ఆధారాలు, సీసీ కెమెరా ఫుటేజీలు, వాహ నాల కదలికలు, నిందితుల కాల్ డేటాను విశ్లేషించడం ద్వారా కేసును ఛేదించడంలో ఆదిలాబాద్ జిల్లా పోలీస్ ప్ర త్యేక బృందం కీలకపాత్ర పో షించిందని ఎస్పీ తెలిపారు. ప్రజలు తమ పశువులను రా త్రి వేళల్లో సురక్షిత ప్రదేశాల లో కట్టి వేయాలని, అనుమా నాస్పద వ్యక్తులు లేదా వాహ నాలు కనిపించిన వెంటనే స మీప పోలీస్ స్టేషన్కు లేదా డ యల్-100 కు సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ అ ఖిల్ మహాజన్ ఐపీఎస్ సూ చించారు. ఈ కేసును ఛేదిం చిన పోలీసు అధికారులను, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినం దించారు.ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవ న్ రెడ్డి, టౌన్ ఇన్స్పెక్టర్ కె నా గరాజు, వన్ టౌన్ ఇన్స్పెక్టర్ బి సునీల్ కుమార్, సిసిఎస్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్, ఆర్ ఎస్ ఐ గోపికృష్ణ, ప్రణయ్, అ ఖిల్ సిబ్బంది నరేష్, క్రాంతి, త్రిశూల్, రాథోడ్ కిషన్ తది తరులు పాల్గొన్నారు.

## సోనాలలో ప్రారంభమైన మొహరం ఉత్సవాలు

**సోనాల, జూన్ 21 ( ప్రజాజ్యోతి ):**సోనాల మండల కేంద్రంలోని పాతబస్తీలో ఆదివారం రోజున మొహరం ఉత్సవాలు అత్యంత భక్తి శ్రద్ధలతో వైభవంగా ప్రారంభమయ్యాయి. హిందూ ముస్లింల విలక్ష ణమైన మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే ఈ పండుగను ఘనంగా జరుపుతామని నిర్వాహకుడు తుల సాగర్ తెలిపారు.ఈ ఉత్సవాల్లో భాగంగా గ్రామ పెద్దలు అలాయ్ ఆటతో సందడి చేశారు. జాతిమత భేదాలు లేకుం డా గ్రామంలోని హిందూ ముస్లిం లందరూ కలిసి, ఈ ఉత్సవాల్లో పాల్గొనడం ఇక్క డి ప్రత్యేకత గా చెప్పుకోవచ్చని నిర్వాహకులు తెలిపారు.



## తాండూర్లో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు

**తాండూర్ :** అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను ఆదివారం మంచిర్యాల జిల్లా తాండూర్ మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. మాదారం పోలీస్ స్టేషన్ గ్రౌండ్లో తాండూర్ మండల వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో, తాండూర్ పీహెచ్సీ ఆయుష్ దవాఖానలో డాక్టర్ సౌజన్య ఆధ్వర్యంలో సామూహిక యోగా సాధన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాయామాలు, ఆసనాలు, ప్రాణాయామం, ధ్యానం వాటి ప్రయోజనాలు గురించి యోగా శిక్షకులు, పీఈటీ తొగరి శ్రీనివాస్, ఉప్పుట్ల చందు అవగాహన కల్పించి కొన్ని ముఖ్యమైన ఆసనాలను కార్యక్రమానికి హాజరైన వారితో వేయించారు. యోగా సాధనతో అనేక శారీరక రుగ్మతలు దూరం కావడంతో పాటు మానసిక ప్రశాంతత చేకూరుతుందని అన్నారు. నిత్యం యోగా సాధనతో మన శరీరంలోని అవయవాలన్నీ సక్రమంగా పని చేసి వ్యాధులను దూరం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, తాండూర్ మండల వాకర్స్ క్లబ్ సభ్యులు, యోగా సాధకులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## వానలు కురవాలని హిమ్మత్నగర్లో కప్పతల్లి ఆడిన గ్రామస్తులు

**వీణవంక :** వీణవంక మండలంలోని హిమ్మత్నగర్ గ్రామంలో ఆదివారం వానలు కురవాలని కోరుతూ సర్పంచ్ జడల శ్రీకాంత్తో పాటు పాలకవర్గ సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పెద్దలు అందరూ కలిసి కప్పతల్లి ఆట ఆడి, ప్రత్యేక పూజలు చేశారు. పిల్లలు, పెద్దలు, మహిళలు, పురుషులు బిందెలతో నీళ్లు ఎత్తుకొని గ్రామంలోని బొడ్రాయి, హనుమాన్, పోచమ్మతల్లి దేవాలయాల్లో విగ్రహాలకు నీళ్లు పోసి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సాగుకాలం దాటిపోతున్నా వర్షాలు కురవకపోవడంతో వరుణ దేవుడు కరుణించాలని కోరుతూ గ్రామంలో కప్పతల్లి ఆడి, గ్రామంలోని దేవతలందరికీ ప్రత్యేక పూజలు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మ్యాక శ్రీనివాస్, హనుమాన్ దేవాలయ కమిటీ చైర్మన్ నల్ల తిరుపతిరెడ్డి, వార్డు సభ్యులు, నాయకులు గెల్లు రమేష్, కర్ణకంటి భాస్కర్రెడ్డి, నల్ల కొండాల్రెడ్డి, రఘువరన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## గోదావరిఖనిలో ఆకట్టుకున్న సామూహిక యోగాసనాలు

**కోల్ :** ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా గోదావరిఖని ఆర్యవైశ్య భవన్ లో ఆదివారం నిర్వహించిన సామూహిక యోగాసనాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. యాంత్రిక జీవనంలో ఆరోగ్యమే మహాభాగ్యమని సందేశాన్ని ప్రజల్లో స్ఫూర్తి కలిగించేలా వివిధ వర్గాల ప్రజలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని యోగాసనాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి యోగసానాలతో ఆకట్టుకున్నారు. ఆమె మాట్లాడుతూ యోగ అనేది వ్యాయామం మాత్రమే కాదనీ, మనిషి శరీరం, మనసు, ఆత్మను ఏకం చేసే గొప్ప సాధనమని పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరూ తమ దైనందిన జీవితంలో 'యోగను దినచర్యగా అలవర్చుకోవాలన్నారు. యోగ గురువు సరోత్తమరెడ్డి మాట్లాడుతూ యోగ సాధన ద్వారా ఆరోగ్యంపై ఆసక్తి పెంపొందించుకోవడంతో పాటు భారతీయ సంస్కృతి గొప్పతనంను గుర్తు చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో యోగా గురువు రజనీ, సుల్వ లక్ష్మీనారాయణ, ఊరగొండ అపర్ణ, గుండబోయిన భూమయ్య, ఎల్తూరి సరిత, జక్కుల పద్మ, కోట తిరుమల, జక్కన రాజ్యలక్ష్మీ, కోడూరి రమేష్, జక్కన్న బాలు, ప్రవీణ్, లక్ష్మీనర్సయ్య, గంగరాజు, రాజయ్య, నరసింహారెడ్డి, కళ్యాణ్, వకులాభరణం వేణు, జనగామ శివరాం అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.